ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

శనివారం 22 నవంబరు 2025

పేట..అభివృద్ధిలో చోటా..!

- రూ.100 కోట్ల అభివృద్ధి జాడేది..!
- వందేళ్ల చరిత్ర ఉన్న రాజంపేటలో పడకేసిన అభివృద్ధి
- తిరోగమన దిశగా పట్టణం.. కనుమరుగవుతున్న అభివృద్ధి





ట్రాఫిక్ పద్మవ్యూహం

రాజంపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం అభివృద్ధిలో తిరోగమన దిశలో పయని స్తోంది. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంగా, వందేళ్లుగా ఐఏఎస్ కేడర్ కలిగిన సబ్‌కలెక్టర్ కార్యాలయ కేంద్రంగా ఎంతో పేరు గడించిన రాజంపేట పట్టణం కాలానికి తగినట్లు అభివృద్ధికి దూరంగా ఉంది. అన్నమయ్య నడియాడిన రాజంపేట పట్టణం బ్రిటీష కాలంలోనే సబ్‌కలెక్టర్ కార్యాలయ కేంద్రంగా నెలకొల్పబడి సబ్‌డివిజన్ కేంద్రంగా ఎంతో గుర్తింపు పొందింది. అటువంటి పట్టణంలో అన్ని రకాల అభివృద్ధి నిరోధక పట్టణంగా తయారైంది. గతంలో 17 మండలాల సువిశాల సబ్‌కలెక్టర్ రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతం ఆ తర్వాత బద్వేల్ డివిజన్ ఏర్పాటు కావడంతో ఆరు మండలాలు తగ్గి కేవలం 11 మండలాలకే పరిమిత మైంది. సుమారు లక్ష జనాబా కలిగి చుట్టూ 8 కిలోమీటర్లలో విస్తరింపబడిన పట్టణంలో కనీస వసతులు లేకుండా పోయాయి. 15 ఏళ్లుగా ఒక్క అభివృద్ధి కార్యక్రమం పట్టణంలో జరగలేదు. జగన్ ప్రభుత్వ హయాంలో పట్టణంలో వంద కోట్ల అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చిన వైసీపీ నేతలు ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేకపోయారు.

రాజంపేట పట్టణంలో 29 వార్డులున్నాయి. ఒక్కో వార్డులో 2 వేల నుంచి 3 వేల జనాబా ఉంది. ఇంత పెద్ద పట్టణంలో ఇంతవరకు రోడ్ల విస్తరణ జరగలేదు. రోడ్ల వెడల్పు చేయకపోవడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రధానంగా పోస్టాఫీసు నుంచి పాతబస్టాండు వరకు పాత బస్టాండు వరకు రైల్వేస్టేషన్ వరకు మొత్తం ఆక్రమణలతో రహదారిలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. నిత్యం పట్టణంలో కోడూరు, తిరుపతి, చెన్నై, కడప, హైదరాబాదు, రాయచోటి, కదిరి, బెంగళూరు, నెల్లూరు, గూడూరు, విజయవాడ చుట్టుపక్కల అనేక ప్రధాన నగరాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు వందలాదిగా వెళుతుంటాయి. ఇవన్నీ రాజంపేట పట్టణం గుండానే వెళుతుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు కాలువలను వెడల్పు చేసి పట్టణానికి తగ్గట్టు మురికినీరు, వర్షపునీరు, పోవడానికి పట్టణానికి తగ్గట్టు కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో వర్షాకాలంలో మురికినీరంతా రోడ్లపై ప్రవహించి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో బ్రిటీష కాలం నుంచి బుధవారం వారాంతపు సంత జరుగుతుంది. కూరగాయలు అమ్ముకునే వ్యాపారులు మార్కెట్ దారిలోనే అడ్డంగా పెట్టుకుని వ్యాపారాలు చేయడం వల్ల మార్కెట్‌లోకి వెళ్లలేని పరిస్థితి ఉంది. మార్కెట్ లోపల కనీస సౌకర్యాలు లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతూ ఉంటుంది. కూటమి ప్రభుత్వంలోనైనా రాజంపేటను పట్టించుకుని అభివృద్ధి పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చెత్తా చెదారంతో నిండిపోయిన వీధులు

నిధుల లేమితో కుంటుపడుతున్న అభివృద్ధి



మున్సిపల్ పాలకమండలి బాధ్యతలు తీసుకున్న వెంటనే ఇతర పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేయడానికి వంద కోట్ల అభివృద్ధి ప్రణాళికలను నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించాము. నిధుల లేమి వల్ల ఆ అభివృద్ధి ప్రణాళిక ముందుకు సాగలేకపోయింది. నేను మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రెండేళ్లలో నిధులు విడుదల కాలేదు. అనంతరం కూటమి ప్రభుత్వం రావడంతో వంద కోట్ల అభివృద్ధి ప్రణాళిక పక్కన పడిపోయింది. పట్టణంలో అభివృద్ధి పనులు చేయడానికి కృషి చేస్తున్నాం.

\- పోలా శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ చైర్మన్, రాజంపేట

పట్టణానికి తగ్గట్టు పనులు జరగడం లేదు



పట్టణానికి తగ్గట్టు రాజంపేటలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదు. పట్టణానికి చుట్టూ కడప, రాయచోటి, తిరుపతిలలో అభివృద్ధి జరుగుతుంటే ఇక్కడ రూపాయి అభివృద్ధి కూడా జరగలేదు. మేము నామమాత్రంగా కౌన్సిలర్లుగా ఉన్నామే తప్ప ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేకపోతున్నాం. పట్టణంలో ప్రధానంగా ప్రధాన రోడ్ల విస్తరణ, రింగ్ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ లాంటి సమస్యలను తక్షణం పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

\- గుగ్గిళ్ల వసంత, కౌన్సిలర్, బలిజపల్లె వార్డు

మాక్ అసెంబ్లీకి ఏడుగురు విద్యార్థులు ఎంపిక

- జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం

6

చెయ్యేరుపై బ్రిడ్జి నిర్మించేదెప్పుడో..?

- 3 కి.మీ. దూరానికి 30 కి.మీ. ప్రయాణం
- పెనగలూరు, నందలూరు మండల ప్రజలకు అగచాట్లు

6

భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా రీసర్వే

6

- పైలట్ ప్రాజెక్టును పరిశీలించిన రాష్ట్ర సర్వే డిప్యూటీ డైరెక్టర్

లెక్కాజమ లేకుండా దోచుకున్నారు

- వేమన విగ్రహాన్ని రోడ్డుపై వేయడం దారుణం
- దొడ్డిదారిన ఎంప్లాయిమెంట్ పెంచారు
- 16 ఏళ్లుగా ఆడిట్ వివరాలు లేవు
- సవివరమైన నివేదిక అసెంబ్లీకి సమర్పిస్తాం
- ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీ కమిటీ చైర్మన్ కూన రవికుమార్.. చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తదితరులు

కడప కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): "యోగివేమన యూనివర్శిటీ, వైఎస్సార్ ఫైన్ ఆర్ట్స్, పాడా, ఏపీ కార్ల్, ఏపీ జెన్‌కో, కడప స్టీల్, రాయలసీమ స్టీల్ అథారిటీ, టూరిజం తదితరాలను పరిశీలించాం. దొడ్డిదారిన ఉద్యోగాల నియామకాలు జరిగాయి. 16 ఏళ్లుగా ఆడిట్ అభ్యంతరాలు ఉన్నాయి. లెక్కాజమ లేకుండా దోపిడీ సాగింది. వీటన్నింపై ప్రభుత్వానికి, అసెంబ్లీకి సవివరంగా నివేదికలు సమర్పించి చర్యలకు సిఫార్సు చేయనున్నాం" అని ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ స్పష్టం చేశారు.

శుక్రవారం కలెక్టరేట్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం ఆర్టీపీపీని విజిట్ చేశామన్నారు. కంపెనీ పనితీరు విద్యుత్ ఉత్పత్తి, ఉద్యోగులు, రాబడిని పరిశీలించామన్నారు. వైవీయూ, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్, ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ, రాయలసీమ, కడప స్టీల్ కార్పొరేషన్‌లపై సమీక్షించామన్నారు. ఈ రెండు స్టీల్ కార్పొరేషన్లు పనిచేయడం లేదన్నారు. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) క్లోజ్ అయిందన్నారు. ఐదేళ్లుగా ఎంత బడ్జెట్ వచ్చింది? ఎంత ఖర్చు పెట్టారనే విషయంపై కమిటీ చర్చించిందన్నారు. అలాగే కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కడప రీజియన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, ఖర్చులు, రాబడి తదితరాలతో పాటు ఏపీ లైవ్ స్టాక్ రీసర్చ్, ఏపీ కార్ల్‌పై సమీక్షించామన్నారు.

వైవీయూలో అక్రమాలు

వైవీయూలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. చరిత్ర పురుషుడు యోగి వేమన విగ్రహాన్ని రోడ్డున పడేయడం దారుణమన్నారు. చరిత్రను కూడా కించపరచడం అంటే మన జాతిని మనం కించపరచడమే అని ఆవేదన వ్యక్తం చేశారు. వైవీయూలో 50 శాతం మాత్రమే అడ్మిషన్లు జరుగుతున్నాయని, అయితే ఉద్యోగుల నియామకాలు పెద్ద స్థాయిలో జరగడం చూస్తే అక్రమాలు జరిగినట్లు తెలుస్తోందన్నారు.

సమగ్ర వివరాలతో నివేదిక

పులివెందులలో టూరిజం, కార్పొరేషన్ డబ్బుతో ఒక ఎసెట్ కొనుగోలు చేశారన్నారు. ఆ వివరాలు పాడా, టూరిజం రికార్డుల్లో లేవన్నారు. ప్రతి కార్పొరేషన్, అథారిటీ, ఫైనాన్స్ అవకాశాలను పరిశీలించిందన్నారు. ప్రతి ఏటా ఆడిట్ చేయించి రిపోర్టులన్నీ అసెంబ్లీకి సమర్పించాలన్నారు. కానీ అలాంటి ప్రక్రియ 16 ఏళ్లుగా జరగలేదన్నారు. సమగ్ర వివరాలతో అసెంబ్లీకి, ప్రభుత్వానికీ నివేదికలు సమర్పిస్తామన్నారు. గత ప్రభుత్వం పరిపాలనలో విఫలమైందని విమర్శించారు. వాటిని గుర్తించి, సూచనలు చేశామన్నారు.

అంతకు ముందు కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌హాలులో పీఏసీ కమిటీ సమావేశం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, పామర్రు ఎమ్మెల్యే కుమార రాజా వర్ల, కాంట్రాక్టర్ ఇసాక్‌బాష, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, అసిస్టెంట్ సెక్రటరీ నాగమునెయ్య తదితరులతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి ఏపీ లెజిస్లేటివ్ అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ(పీఏసీ) సలహాలు సహకారం ఎంతో అవసరమన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

చిన్నమండెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టు పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని భారీ నీటి పారుదల, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులకు కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు. అనంతపురం శ్రీనివాసపురం రిజర్వాయర్ సామర్థ్యం 1.02 టీఎంసీలు కాగా 28 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి వీలవుతుందన్నారు. 2 ప్రధాన కాలువల పనులు పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్టు కింద భూమిని కోల్పోయిన రైతులకు పునరావాసం కల్పించామని, కాలువల బ్రిడ్జి పనులు, లైనింగ్ పనులు తదితరవి పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ పనులకు సంబంధించిన నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపామని, ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో నీటి పారుదలశాఖ ఎస్ఈ వెంకటరామయ్య, ఇరిగేషన్ ఈఈ భరత్‌కుమార్, హెచ్ఎంఎస్ఎస్ అధికారి రాజగోపాల్, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యం

- ప్రతిరోజూ ఫిర్యాదుల స్వీకరణ తప్పనిసరి
- డీఈవో, ఎంఈవోలకు విద్యాశాఖ ఆదేశాలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో సేవల నాణ్యత పెంపు, బాధ్యతాయుత పరిపాలన, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తరపున డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజు రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీఈవోలు, ఎంఈవోలను నేరుగా ఉద్దేశిస్తూ ఈనెల 19వ తేదీన కీలక ఉత్తర్వులు జారీ చేశారు. రోజూ కార్యాలయంలోనే ఉండి ఫిర్యాదులు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ సమస్యలు చెప్పాలంటే అధికారులు కార్యాలయంలో అందుబాటులో లేరన్న విమర్శలు తరచూ విద్యాశాఖ దృష్టికి వస్తున్నాయి. దీనిని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి పని దినంలో తప్పనిసరిగా ఒక గంట సమయం ప్రజా ఫిర్యాదులకు కేటాయించాలని స్పష్టంగా తెలిపింది. ఆయా సమయాల్లో అధికారులు సంబంధిత కార్యాలయాల్లో లేకుంటే కఠిన చర్యలు



తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది.

నిరంతరం అందుబాటులో..

ప్రభుత్వ విధానాల ప్రకారం పాఠశాల విద్యాశాఖలో ఫిర్యాదుల పరిష్కారం అత్యంత ప్రాధాన్యత అంశం. గ్రామం నుంచి జిల్లా వరకు.. ఉపాధ్యాయుల నుంచి తల్లిదండ్రుల వరకు.. విద్యార్థుల సంక్షేమం మొదలు పాఠశాలల అభివృద్ధి వరకు ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యకు స్పందన త్వరగా లభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రతిరోజూ వారికి కేటాయించిన సమయాల్లో అందుబాటులో ఉంటే సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని విద్యాశాఖలో ఆశాభావం వ్యక్తమవుతోంది.

ఈ సమయాల్లో ఉండాల్సిందే..

ఎంఈవోలు ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు వారి కార్యాలయాల్లో ఉండాలి. డీఈవోలు సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు ఉండాలి. ఈ గంటల్లో అధికారులు తమ కార్యాలయాల్లోనే ఉండి, ఉపాధ్యాయుల సమస్యలు, పాఠశాలల మౌలిక వసతులు, విద్యార్థుల సేవలకు సంబంధించిన సమస్యలు, పరిపాలన ఇబ్బందులకు సంబంధించిన సమస్యలపై వినతులు స్వీకరించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. తమ పరిధిలోని ఎంఈవోలు ఈ టైమింగ్స్‌ను కచ్చితంగా పాటించేలా డీఈవోలు పర్యవేక్షించాలని కూడా పేర్కొంది. దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తే తీవ్రంగా పరిగణిస్తామని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

వెలిగల్లు ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రాబోయే వర్షాలను అంచనా వేయాలి
- కలెక్టర్ నిశాంత్‌కుమార్

గాలివీడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకొని వెలిగల్లు ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు. ఆయన శుక్రవారం మండల కేంద్రానికి సమీపంలోని వెలిగల్లు ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 4.64 టీఎంసీలని, ప్రస్తుతం 4.15 టీఎంసీలు ప్రాజెక్టులో నీటి నిల్వ వుందని, ఇంకా 0.51 టీఎంసీలు చేరితే పూర్తి స్థాయిలో ప్రాజెక్టు నిండుతుందని ప్రాజెక్టు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గత మూడు నెలలుగా కుడి, ఎడమ కాలువల ద్వారా గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లోని 59 చెరువులను నింపామని, కేవలం 15 చెరువులు మాత్రమే నింపాల్సి ఉందని, వీటిని కూడా త్వరలో నింపుతామని తెలియజేశారు. ఆకస్మికంగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వచ్చే వరద నీటిపైన అధికారులందరూ ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వెంకటరామయ్య, భరత్‌కుమార్, డీఈఈ భాస్కర్‌బాబు, ఏఈఈలు గంగాధర్, సాంబశివుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకయ్య తదితర ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర చట్టం కింద నమోదు చేయబడిన ఏదైనా చట్టపరమైన సంస్థ, కోపరేటివ్ సొసైటీ, ట్రస్టు, వాహన తయారీదారులు లేదా ఎన్జీవోల నుంచి డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను జిల్లా రవాణాశాఖ కార్యాలయం రాయచోటిలో ఈ నెల 26వ తేదీ లోపు సమర్పించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా డ్రైవింగ్ శిక్షణ కోసం వీలైనన్ని ఎక్కువ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు అవసరమున్న నేపథ్యంలో డ్రైవింగ్ శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు రవాణాశాఖ అనుమతులు ఇస్తుందని, కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కింద ఆర్థిక సాయం కూడా అందిస్తుందని తెలిపారు. ప్రతి 10 లక్షల జనాబాకు ఒక డ్రైవింగ్ శిక్షణ కేంద్రం, 10- 20 లక్షలు ఉంటే మరో శిక్షణ కేంద్రం మంజూరు చేస్తామని, జిల్లాలో మొత్తం 2 డీటీసీలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు కలెక్టర్ ప్రతిపాదనను పంపుతారని, ఆ శాఖ అనుమతులు మంజూరు చేస్తుందన్నారు. ఎంపిక చేయడిన ఏజెన్సీ తమ ప్రాజెక్టు ఖర్చులో 85 శాతం మేరకు సహాయం పొందుతుందని, ప్రతి డ్రైవింగ్ శిక్షణా కేంద్రానికి గరిష్ఠంగా రూ.2.50 కోట్ల వరకు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సుమారు 2 ఎకరాల సొంత భూమి లేదా లీజుకు తీసుకోబడిన భూమి వుండాలని వివరించారు.

ఆ టీచర్ మాకొద్దు!

- లెక్కలకు బదులు సెక్స్ పాఠాలు చెబుతోంది
- గణిత ఉపాధ్యాయురాలిపై విద్యార్థినుల ఫిర్యాదు
- ఉపాధ్యాయురాలిని నిలదీసిన తల్లిదండ్రులు



విద్యార్థినులను విచారిస్తున్న ప్రిన్సిపాల్ కరుణ

పీలేరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): లెక్కల సబ్జెక్టు టీచరు తమకు సెక్స్ పాఠాలు బోధిస్తోందంటూ విద్యార్థినులు తమ తల్లిదండ్రుల వద్ద మొరపెట్టుకున్నారు. దీంతో కొంత మంది తల్లిదండ్రులు గురుకులానికి చేరుకుని సదరు ఉపాధ్యాయురాలిని నిలదీశారు. ఈ సంఘటన శుక్రవారం పీలేరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో జరిగింది. తల్లిదండ్రుల కథనం మేరకు.. పీలేరు-చిత్తూరు మార్గంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 8, 9, 10వ తరగతులకు పరిమళ అనే గణిత ఉపాధ్యాయురాలు పనిచేస్తున్నారు. ఆమె ఈ ఏడాది ఏప్రిల్‌లో బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆమె తమకు గణితం కంటే పదే పదే సెక్స్ గురించి చెబుతోందని చాలా మంది విద్యార్థినులు శని, ఆదివారాల్లో తమను కలిసిన తల్లిదండ్రుల వద్ద వాపోయారు. అంతే కాకుండా తమ ఆవేదనను ఫిర్యాదు రూపంలో గురుకులంలోని ఫిర్యాదుల పెట్టెలో కూడా వేశారు. ఉపాధ్యాయురాలు సెలవులో ఉండడంతో చాలా మంది తల్లిదండ్రులు ఈ విషయాన్ని గురుకులం ప్రిన్సిపాల్ జి.కరుణ దృష్టికి తీసుకెళ్లి వెనుదిరిగారు. ఆమె శుక్రవారం విధులకు హాజరైందని తెలియడంతో తల్లిదండ్రులు గురుకులానికి చేరుకున్నారు. తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ ఎదుట విద్యార్థినులు ఆ ఉపాధ్యాయురాలిపై బహిరంగంగానే ఫిర్యాదు చేశారు. ఆమె తమకు తరచూ సెక్స్ గురించి చెప్పడమే కాకుండా అమ్మాయిలు సెక్స్ కోసమే పనికి వస్తారని, ఇళ్లలో అమ్మా, నాన్నలు కూడా సెక్స్ చేసుకుంటారని చెబుతుందని వారు ప్రిన్సిపాల్‌కు తెలిపారు. బతుకుతెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన మహిళల గురించి చులకనగా చెబుతుందన్నారు. ఆ ఉపాధ్యాయురాలిని వెంటనే గురుకులం నుంచి పంపించేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై గురుకులం ప్రిన్సిపాల్ కరుణ మాట్లాడుతూ పరిమళ అంశంపై ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అయితే తాను గురుకులం వైస్ ప్రిన్సిపాల్ పదవి అడిగినందుకే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పరిమళ తెలిపారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జైసూర్య నాయక్

- ఏఈఈగా విధులు నిర్వహిస్తూనే.. క్రీడల్లో సత్తా



సుండుపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు సుండుపల్లె మండలంలో పంచాయతీరాజ్ ఏఈఈగా విధులు నిర్వహిస్తున్న జైసూర్య నాయక్ ఎంపికైనట్లు వారి కుటుంబీకులు శుక్రవారం తెలిపారు. గురువారం విజయవాడలో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి చత్తీస్‌ఘడ్ లేదా గోవా రాష్ట్రాల్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరపున పోటీ చేస్తారని తెలియజేశారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే బ్యాడ్మింటన్‌పై తనకున్న మక్కువతో మారుమూల మండలం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల కుటుంబీకులు, సాటి ఉద్యోగులు అభినందనలు తెలియజేస్తున్నారు. కాగా జైసూర్యనాయక్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి బ్యాడ్మింటన్ పట్ల విశేషమైన అభిమానం ఉందని తెలిపారు.

చెయ్యేరుపై బ్రిడ్జి నిర్మించేదెప్పుడో ?

● 3 కి.మీ. దూరానికి 30 కి.మీ. ప్రయాణం ● పెనగలూరు, నందలూరు మండల ప్రజలకు అగచాట్లు



నీటి ప్రవాహంలో పాడైన రోడ్డుపై తాత్కాలిక ప్రయాణాలు సాగిస్తున్న ప్రజలు

పెనగలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు-నందలూరు మండలాల మధ్య ప్రవహిస్తున్న చెయ్యేరునదిపై హైలెవల్ బ్రిడ్జి లేక రెండు మండలాల ప్రజల ప్రయాణాలు నరకయాతనగా మారాయి. పెనగలూరు మండలం ఓబిలి గ్రామం ద్వారా నందలూరు మండలం టంగుటూరు గ్రామం ద్వారా రెండు మండలాలను కలుపుతూ చెయ్యేరునదిపై ఉన్న మట్టిరోడ్డుపైనే ఇరువైపులా 30 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయా ణాలు సాగిస్తున్నారు. వర్షాలు బాగా వచ్చినప్పుడల్లా ఈ మట్టిరోడ్డు మధ్యలో కొంతదూరం కొట్టుకు పోవడం.. నీరు తగ్గినప్పుడు రెండు మండలాల అధికారులు, నాయకులు మరలా తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేయడం జరుగుతూ వస్తోంది. మట్టిరోడ్డు కొట్టుకుపోతే చుట్టూ 30 కి.మీ. తిరిగి వెళ్లాల్సి వుంటుంది. ఈ మట్టిరోడ్డు స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని రెండు దశాబ్దాలుగా నాయకులు అధికారులతో ప్రజలు పోరాటం చేస్తున్నప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మయ్య హయాంలో రూ.4 కోట్ల వ్యయంతో లోలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా నిధులు మంజూరైనప్పటికీ టెండర్లు పిలవకపోవడంతో అప్పట్లో ఆ పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి మరలా బ్రిడ్జి నిర్మాణానికి రెండు మండలాల్లోని 30కి పైగా గ్రామాల ప్రజలు, నాయకులు అధికారులకు విన్నవిస్తున్నా బ్రిడ్జి నిర్మాణ పనులు కార్యరూపం దాల్చలేదు.

2019-24 మధ్యకాలంలో రాజంపేట ఎమ్మెల్యే సహకారంతో చెయ్యేటిలో ఉన్న మట్టి రోడ్డును పటిష్టం చేస్తూ మరలా రోడ్డు నిర్మించారు. అయితే 2021లో అన్నమయ్య డ్యామ్ తెగిపోవడంతో మట్టిరోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. అప్పటి నుంచి కొట్టుకుపోయిన మట్టిరోడ్డు స్థానంలో మరలా రోడ్డు నిర్మించారు. అయితే నెల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు చెయ్యేటిలో వరదనీరు పారుతుండడంతో మట్టిరోడ్డు పలుచోట్ల కొట్టుకుపోయింది. చెయ్యేటిలో తరచుగా నీటి ప్రవాహం పెరుగుతూ తగ్గుతూ ఉండడం వల్ల మట్టిరోడ్డు పునఃనిర్మించేందుకు అవకాశం లేకుండా పోయింది. అందువల్ల నీటిలో లోతు తక్కువగా ఉన్న ప్రదేశాల నుంచి రెండు వైపులా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఓబిలి-టంగుటూరు మధ్యలో చెయ్యేటి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పెనగలూరు మండలంలోని ఓబిలి, అతిగారిపల్లె, బెస్తపల్లె, సిద్దవరం, ఇండ్లూరు, కొత్తపల్లె, సత్తుపల్లె గ్రామాల ప్రజలతో పాటు నందలూరు మండలంలోని టంగుటూరు, పాచికాలువ, లేబాక, చింతకాయలపల్లె, కొమ్మూరు, కోనాపురం, నల్లతిమ్మాయపల్లె తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే ఉపయోగకరం



ఓబిలి-టంగుటూరు గ్రామాల మధ్యలో చెయ్యేటి నదిపై ప్రభుత్వం హైలెవల్ వంతెన నిర్మిస్తే రెండు మండలాల్లోని 30 గ్రామాల ప్రజల ప్రయాణాలకు ఉపయోగంగా ఉంటుంది. చాలా కాలంగా చెయ్యేటి నదిలో బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వంతో పోరాడు తున్నాం. అది కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హైవే బ్రిడ్జి నిర్మించాలి.

- ఎస్.అమీరుల్లా, ఓబిలి గ్రామ టీడీపీ ఇన్‌చార్జి

నిధులు నిష్ప్రయోజనం అయ్యాయి



మాజీ ఎమ్మెల్యే, చిన్ననీటి తరహా మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య హయాంలో తాను ఓబిలి సర్పంచ్‌గా ఉన్నాను. తన హయాంలో చెయ్యేటి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలనే ఉద్దేశ్యంతో పట్టుబట్టి బ్రహ్మయ్య ద్వారా రూ.4 కోట్లు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాం. కొన్ని రాజకీయ కారణాల వల్ల టెండరు ప్రక్రియ దాకా రాలేదు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు స్పందిస్తే బాగుంటుంది.

- ఎస్.హబీబుల్లా, మాజీ సర్పంచ్, ఓబిలి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● డీఎంహెచ్‌వో నాగరాజు



వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

సిద్దవటం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటించి దోమల వ్యాప్తిని అరికట్టాలని కడప డీఎంహెచ్‌వో నాగరాజు తెలిపారు. మండలంలోని మాధవరం-1 పార్వతిపురం గ్రామంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాత్రివేళల్లో దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు. కుష్ఠువ్యాధి బాధితులను పరామర్శించి తగు జాగ్రత్తలు సూచించారు. కాళ్లు వంకర ఉన్న వారు ఫిజియోథెరపీ చేయించుకోవాలని తెలిపారు. మాధవరం ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ నవంబరు 17 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో స్పర్శలేని పొడలు ఉన్నవారిని గుర్తించి జాగ్రత్తలు, సలహాలు సూచించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, డీపీఎంవో రాఘవ, హెల్త్ సూపర్‌వైజర్ రమణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



అభిషేక్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

రామసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న విద్యార్థి అభిషేక్‌కుమార్(17) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. జక్కంవారిపల్లె వాసి అభిషేక్‌కుమార్ ఇంటర్ చదువుతున్నాడు. కాలేజీకి సరిగా వెళ్లలేదని విద్యార్థి తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికిగురై ఈనెల 13న విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మదనపల్లెలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

పిడుగుపాటుతో మహిళకు తీవ్రగాయాలు



పిడుగుపాటుకు గురైన గౌరమ్మ

ఓబులవారిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పున్నాటివారిపల్లె అరుంధతివాడకు చెందిన గొడుగునూరు గౌరమ్మ అనే మహిళ పిడుగుపాటుతో తీవ్రంగా గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గొడుగునూరు గౌరమ్మ, లేబాకు రామలక్షుమ్మ శుక్రవారం గొర్రెలు మేపుకునేందుకు పచ్చిక బీళ్లలోకి వెళ్లారు. సాయంత్రం 4 గంటల సమయంలో వారికి సమీపంలోనే పిడుగు పడడంతో ఇద్దరూ కుప్పకూలి పోయారు. ఈ సంఘటనలో గౌర మ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కొద్దిసేపటికి తేరుకున్న రామలక్షుమ్మ పరుగెత్తుకొంటూ ఇంటికి వెళ్లి బంధువులకు, కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. దీంతో వారు గౌరమ్మను రైల్వేకోడూరు ఆసుపత్రికి తరలించారు. టీడీపీ నాయకుడు పున్నాటి వాసుదేవరెడ్డి పరామర్శించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

తంబళ్లపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రామిగానిపల్లె వద్ద ఈ నెల 15వ తేదీన చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె క్రాస్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నిందితులు నేరం అంగీకరించారన్నారు. నిందితులు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం విరువూరుకు చెందిన గడ్డం కాశిరెడ్డి(21), కడప జిల్లా సీకే దిన్నె మండలం గురుగుపుడు తండాకు చెందిన బి.సతీష్‌నాయక్(25)గా తెలిపారు. నిందితుల నుంచి 36 గ్రాముల బంగారు చైన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీవనోపాధి మెరుగుకై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నాగేశ్వరరావు

తంబళ్లపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లోని సభ్యుల జీవనోపాధి మెరుగుపరచడంపై దృష్టి సారించాలని సెర్ప్-డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు మహిళా సమాఖ్య కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఏపీఎంలు, డీపీఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు, సీసీలతో పీడీ సమీ క్షించారు. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో తిరిగి చెల్లించేలా చూస్తూ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వ్యాపార అవకాశాలు, రాయితీ రుణాలు, ప్రభుత్వం అందించే ఇతరత్రా ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ మహిళలు సద్వినియోగం చేసుకునేలా చైతన్య పరచాలన్నారు. మహిళలను లక్షాధికారులు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీడీ లక్ష్మీ ప్రసాదరెడ్డి, ఏపీఎంలు గంగాధర్, శ్రీలక్ష్మి, నాగార్జున, శ్రీనిధి మేనే జరు అమరావతి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మి, డీపీ ఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు భవన్‌సాయి

మదనపల్లె అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు వేద పాఠశాల విద్యార్థి జి.భవన్‌సాయి చంద్రకుమార్ ఎంపికైనట్లు కోచ్ రెడ్డి రాఘవేంద్ర తెలిపారు. చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అంతర జిల్లా క్రీడల్లో మొదటి స్థానంలో నిలిచారన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 14 క్రికెట్ క్రీడలు ఈ నెల 29 నుంచి గుంటూరులో జరగనున్నాయి. ఇందులో ఎంపికైన విద్యార్థిని పాల్గొంటాడని శ్రీవేద పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణరెడ్డి, చైర్మన్, రాజు రామమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఉపేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మురళి, ఏవోలు కిషోర్, నాగరాజ, కోచ్ రెడ్డి రాఘవేంద్ర వ్యాయామ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఆ నిర్మాణాలకు అనుమతి లేదు..

- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

బి.కొత్తకోట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డు గంగమ్మ మాన్యం పక్కన నిర్మిస్తున్న షెడ్లకు తమ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులు లేవని నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి ప్రకటించారు. రూ.కోట్ల విలువైన ఈ వివాదాస్పద స్థలంలో హక్కు తమదంటే, తమదంటూ ఇరు వర్గాలూ పోటీ పడుతున్నాయి. ఇందులో బలమైన వర్గం అన్ని శక్తులూ ప్రయోగించి షెడ్ల నిర్మాణం చేపట్టి దాదాపుగా ముగించింది. ఇందులో భూమి హక్కులు ఎవరికున్నా నిర్మాణాలకు నగర పంచాయతీ, టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరి. అయితే ఎటువంటి అనుమతులూ లేకుండా నిర్మాణాలు చేపట్టారు. వాటిని తక్షణం ఆపాలంటూ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. అయినా వాటిని బేఖాతరు చేస్తూ నిర్మాణాలు చేపట్టారు. ఓ వైపు నిర్మాణాలు జరుగుతూనే వుండగా మరోవైపు ప్రత్యర్థి వర్గం వాటిని ఆపడానికి విశ్వప్రయత్నాలు చేస్తూనే వుంది. ఈ క్రమంలో నిర్మాణ స్థలం వద్ద జరిగిన గొడవలకు సంబంధించి బి.కొత్తకోట స్టేషన్‌లో ఈనెల 19న ఓ వర్గానికి చెందిన గడ్డం క్రిష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు డేరంగుల ఓబులేసుపై కేసు నమోదైంది. అయితే ఈ నెల 20న ఓబులేసు అనే వ్యక్తి వివాదాస్పద స్థలం వద్దకు వచ్చి మరోసారి దాడి చేసి మళ్లీ గాయపరిచాడని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ విషయమై కమిషనర్ మాట్లాడుతూ ఒకసారి నోటీసులు ఇస్తే నిర్మాణాలు ఆపకుండా తమ వద్దనున్న కాగితాలు తెచ్చి చూపించారని, అవి సక్రమంగా లేవన్నారు. మేము వెళ్లి పరిశీలించినప్పుడు పనులు ఆపుతారు.. మేము వెళ్లగానే మళ్లీ కడుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాము. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

మార్కెట్ కమిటీ స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణం



ఆయిల్ సీడ్స్ వద్ద సర్వే చేస్తున్న ఏఎంసీ చైర్మన్, డీఈ

పీలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పీలేరు-తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్స్ వద్దనున్న రెండెకరాల పీలేరు మార్కెట్ కమిటీ స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టనున్నట్లు ఏఎంసీ అధ్యక్షుడు పురం రామ్మూర్తి తెలిపారు. ఆయిల్ సీడ్స్ వద్ద పీలేరు మార్కెట్ కమిటీకి గతంలో ప్రభుత్వం రెండెకరాల స్థలం కేటాయించింది. వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా టీడీపీ నేతల ప్రతిఘటనతో వెనక్కు తగ్గారు. ఏఎంసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పురం రామ్మూర్తి ఆ స్థల పరిరక్షణకు ప్రహరీ గోడ నిర్మించాలని ఉన్నతాధికారులకు విన్నవించడమే కాకుండా ఇటీవల పీలేరు పర్యటనకు వచ్చిన మార్కెటింగ్ శాఖ కడప రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆదేశాల మేరకు శుక్రవారం మార్కెటింగ్ శాఖ డీఈ మేఘనాథం సందర్శించారు. స్థల పరిశీలన జరిపి ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రాథమిక సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీల ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే ప్రహరీ గోడ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి హరినాథ్, సూపర్‌వైజర్ భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

వివాహమైన మూడు నెలలకే విగతజీవిగా..



ఆత్మహత్య చేసుకున్న లావణ్య

మదనపల్లె అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వివాహమై మూడు నెలలు గడవకనే ఓ వివాహిత జీవితం ముగిసింది. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, బసిని కొండ గ్రామం, పుంగనూరు రోడ్డుకు చెందిన వెంకటేశ్‌కు, మదనపల్లె మండలం, బండకాడపల్లెకు చెందిన లావణ్య(18)తో పెద్దల సమక్షంలో రెండున్నర నెలల క్రితం వివాహం జరిపించారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ శుక్రవారం రాత్రి ఇంట్లోనే తన చీరకు ఉరేసుకుని వేలాడుతూ లావణ్య కనిపించింది. కుటుంబ కలహాలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ మేరకు మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాక్ అసెంబ్లీకి ఏడుగురు విద్యార్థులు ఎంపిక

● జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం



విద్యార్థులతో డీఈవో సుబ్రహ్మణ్యం తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న అమరావతిలో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీలో పాల్గొనేందుకు అన్నమయ్య జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శాసన సభ సమావేశాల నిర్వహణ, ప్రశ్నోత్తరాల సమయం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ విధులపై అవగాహన కల్పించారు. ఎంపికైన విద్యార్థుల్లో నిమ్మనపల్లి మండలం రాచవీటిపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన పార్థసారథి, పీలేరు మండలం ఎంజేపీ పాఠశాలకు చెందిన తేజశ్రీ, బి.కొత్తకోట మండలం బాలుర జడ్పీ హైస్కూల్ విద్యార్థి అనిల్‌కుమార్, రాయచోటి మండలం మాసాపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన సుష్మతాజ్, వీరబల్లి మండలం జడ్పీ హైస్కూల్‌కు చెందిన కొల్లి వీక్షిత, పెనగలూరు మండలం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన నూర్ ఆయేషా, రాజంపేట మండలం బోయినపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన పట్నం రెడ్డిసాయి ఉన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీలో పాల్గొనే అద్భుత అవకాశం మన జిల్లాకు చెందిన విద్యార్థులకు లభించడం గర్వకారణమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు ప్రజాస్వామ్య విలువలు, శాసన వ్యవస్థపై అవగాహన పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్స్ శివారెడ్డి, రామలక్ష్మి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఏపీవో చంద్రశేఖర్, ఏఎస్‌వో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా రీసర్వే

● పైలట్ ప్రాజెక్టును పరిశీలించిన రాష్ట్ర సర్వేశాఖ డిప్యూటీ డైరెక్టర్



పెంచుపాడు గ్రామం వద్ద రీసర్వే వివరాలను తెలుసుకుంటున్న గౌస్‌బాషా, భరత్

మదనపల్లెటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో గ్రామాల హద్దులు, రైతుల భూముల హద్దుల గుర్తింపులో ఇబ్బందులు లేకుండా మూడో విడత రీసర్వే నిర్వహిస్తున్నామని రాష్ట్ర సర్వేశాఖ డిప్యూటీ డైరెక్టర్ గౌస్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండలం పెంచుపాడు వద్ద జరుగుతున్న రీసర్వే పనులను జిల్లా సర్వే ఏడీ భరత్‌తో కలిసి డిప్యూటీ డైరెక్టర్ పరిశీలించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా పెంచుపాడు గ్రామంలో మూడో విడత సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వచ్చామన్నారు. ఇక్కడ వచ్చే సమస్యలు, వాటిని ఎలా పరిష్క రించాలో తదితర విషయాలను జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. రైతులందరి సమక్షంలో ఈ సర్వే చేయించడంతో పాటు, సర్వే విషయాలను గ్రామ సభలు నిర్వహించి రైతుల ఆమోదంతోనే రికార్డుల్లోకి ఎక్కిస్తా మన్నారు. పాత విలేజ్ మ్యాపుల ఆధారంగా రీసర్వే నిర్వహించడంతో పాటు దారి సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నా మన్నారు. ప్రభుత్వ స్థలాలు, వాగులు, వంకలు ఆక్రమణలను గుర్తించడం, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ముఖ్యంగా వాటర్ బాడీస్ ఆక్రమణలను ఉపేక్షించేది లేదన్నారు. పెంచుపాడు పంచాయతీ తేనెటీగలపల్లె, గొల్లపల్లె హ్యాబిటేషన్‌లలో భూమి జాయింట్ హద్దుల సమస్యలు వున్నాయని రైతులు గౌస్‌బాష దృష్టికి తీసుకెళ్లడంతో వాటిని దగ్గరుండి పరిష్కరించాలని మండల సర్వేయర్ సుబ్ర మణ్యంను ఆదేశించారు. కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

గుండ్లపల్లెను మోడల్ విలేజ్‌గా తయారు చేద్దాం

● ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఫోర్డు సంస్థ డైరెక్టరు లలితమ్మ

తంబళ్లపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లెను ప్రకృతి వ్యవసాయంలో మోడల్ విలేజ్‌గా తయారుచేసి మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుపుదామని ఫోర్డు సంస్థ డైరెక్టరు లలితమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ అంజనప్ప, ఏపీ సీఎన్‌ఎఫ్(ఏపీ రైతు సాధికార సంస్థ) సిబ్బందితో కలసి ప్రకృతి వ్యవసాయంపై ఉపయోగాలు, ఆవశ్యకత, రైతుల బీడు భూములను వ్యవసాయ భూములుగా మార్చడం, మొక్కలు నాటడం, నీటి కుంటల ఏర్పాటు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ థామస్‌రాజ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, మన పూర్వీకుల్లా సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వైపు రైతులు దృష్టి పెట్టాలన్నారు. ఏపీఎఫ్ ప్రాజెక్ట్ కన్సల్టెంట్ డాక్టర్ ప్రహ్లాద మాట్లాడుతూ గుండ్లపల్లె పంచాయతీలోని పాపిరెడ్డిగారిపల్లె, చెట్లవారిపల్లె, గుండ్లపల్లె గ్రామాలను ప్రకృతి వ్యవసాయానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫోర్డు సిబ్బంది వీవీ రమణ, సంపూర్ణ, హేమంత్‌కుమార్ వ్యవసాయ శాఖ సిబ్బంది సుప్రియ, రైతు సాధికార సంస్థ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేతలు.. వైజాగ్, అనంతపురం జట్లు

మదనపల్లెఅర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా మదనపల్లె మండలం, పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య, చంద్రమాకులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 బాలుర విజేతలుగా వైజాగ్, బాలికల విజేతలుగా అనంతపురం జట్లు నిలిచాయని ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్‌బాబు, అడ్మిన్ కార్యదర్శి శారద, ఆర్గనైజింగ్ కార్యదర్శి మురళీధర తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాష విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఏపీ స్కూల్ గేమ్స్ అండర్-14 జట్లకు ఎంపిక చేసినట్లు అబ్జర్వర్ పాల్ తెలిపారు.

10 మంది పేకాటరాయళ్లు అరెస్టు

● రూ.24,640 నగదు, బైకులు, ఆటో స్వాధీనం

మదనపల్లెఅర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న పది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.24.640 నగదు, పది సెల్‌ఫోన్లు, రెండు బైకులు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం టీకెపల్లె కాలనీ సమీపంలో ఓపెన్ ప్లేసులో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పేకాట స్థావరంపై దాడి చేసినట్లు సీఐ వివరించారు. ఈ మేరకు వారిని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



లోన్ యాప్... తస్మాత్ జాగ్రత్త



- అవసరమని తీసుకుంటే.. మీ అకౌంటును ఖాళీ చేస్తారు
- ఆన్‌లైన్ యాప్‌లతో వేధింపులు తప్పవు
- 11 నెలల్లో 271 ఫిర్యాదులు.. రూ.42లక్షలు పైనే స్వాహా

కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మన ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకుని వేధింపులకు, ఆర్థిక మోసాలకు పాల్పడే ఫేక్ లోన్ యాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొ స్తున్నాయి. ఈ రుణ యాప్‌ల వలలో చిక్కుకొని కొందరు విలవిలలాడుతున్నారు. తమ అవసరాల కోసం రుణాలు పొందిన వారి నుంచి అంతకు పదిం తలు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒకవేళ డబ్బులు కట్టకపోతే మొబైల్‌లో ఉన్న డేటా దొంగలించి ఫొటోలు మార్ఫింగ్ చేసి కాంటాక్టుల్లో ఉన్న అందరికీ షేర్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతుంటారు. ఒకప్పుడు పర్సనల్ లోను తీసుకోవాలంటే చాల పెద్ద ప్రాసెస్ ఉండేది. బ్యాంకుల్లో లోను కోసం దరఖాస్తు చేస్తే ఆ వ్యక్తి ఆదాయ వివరాలు అన్నీ పరిశీలించిన తరువాత రుణం మంజూరు చేయాలా లేదా అని నిర్ణయించేవారు. ఈ ప్రాసెస్ మొత్తం రెండు మూడు వారాల నుంచి నెలల సమయం పడుతుం డేది. ఇప్పుడు పర్సనల్ లోను తీసుకోవాలంటే మంచి క్రెడిట్ హిస్టరీ ఉంటే ఆన్‌లైన్‌లో పది నిమిషాల్లోనే రుణం పొందవచ్చు.

సోషల్ మీడియాలో వచ్చే లోన్ యాప్‌లను నొక్కి మనకు కావలసిన అమౌం టుతో పాటు మన వ్యక్తిగత వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. అయితే సదరు సంస్థలకు సకాలంలో రుణాలు చెల్లించకపోతే యాప్‌ల నిర్వాహకులు వేధింపులు మొదలు పెడ తారు. వీళ్ల వేధింపులు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా గతంలో ఎన్నో ఉన్నాయి. ఇలాంటి సోషల్ మీడియాలో వచ్చే నకిలీ యాప్‌ల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేధింపులు తాళలేక...

జిల్లాలో యాప్‌ల ద్వారా లోన్లు పొందిన వారు 11 నెలల్లో దాదాపు 271 మంది ఉన్నా రంటే.. ఎలా మోసపోతున్నారో ఇట్టే అర్థమవుతుంది. ఇక లోను యాప్‌ల ద్వారా లోన్ తీసుకున్న వారు తీసుకున్న డబ్బుల కంటే దాదాపు 42 లక్షల వరకు అధిక వసూళ్లకు పాల్పడ్డారు. దీంతో లోను యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక చివరికి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి లోను యాప్‌లపై తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నకిలీ యాప్‌లే ఎక్కువ

తమ అవసరాల నిమిత్తం డబ్బు కోసం సోషల్ మీడియాను కొంతమంది వేదికగా చేసుకుంటున్నారు. అందులో వచ్చే ప్రకటనలకు ఆకర్షితులై లింకులు క్లిక్ చేసి తమ వ్యక్తిగత సమాచారం ఇవ్వడంతో వారి మొబైల్‌లో ఉన్న డేటాను సైబర్ నేరగాళ్లు కొట్టేస్తారు. మొత్తం మన మొబైల్‌లో ఉన్న అన్ని కాంటాక్టు నెంబర్లు, ఫొటోలు, డేటాను యాక్సస్ చేసుకుంటారు. ఇది లోన్ తీసుకున్నవారి పాలిట శాపంగా మారుతుంది. ఇలాంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలంటూ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మోసపోయిన బాధితుల్లో కొందరు...

- కడపకు చెందిన ఓ యువతి తన అవసరాల కోసం రుణయాప్ ద్వారా రూ.50వేలు తీసుకుంది. తీసుకున్న డబ్బు కంతుల వారీగా చెల్లించింది. అయినా సైబర్ నేరగాళ్లు ఆ యువతినే డబ్బులు కట్టాలంటూ వేధింపులకు గురి చేశారు. తాను తీసుకున్న డబ్బులు కంటే అధికంగా డబ్బులు చెల్లించానని చెప్పినా టార్చర్ పెట్టారు. వాళ్ల టార్చర్ భరించిలేక ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది.
- కడపకు చెందిన ఓ వ్యక్తి వ్యాపార అవసరాల నిమిత్తం రూ.32లక్షలు ఈ నకిలీ యాప్ ద్వారా లోను పొందారు. అయితే అతను తిరిగి డబ్బులు చెల్లిస్తున్నా మిగతా డబ్బులు కూడా కట్టాలని, లేకుంటే నీ ఫొటోలు కాంటాక్టులందరికీ పంపిస్తానని బెదిరింపులకు పాల్పడడంతో ఆ వ్యక్తి పోలీసులను ఆశ్రయించారు.
- ప్రొద్దుటూరుకు చెందిన ఓ మహిళ లోను యాప్ ద్వారా రుణం తీసుకుంది. డబ్బులు చెల్లించినప్పటికీ మళ్లీ డబ్బులు కట్టా లని రకరకాల నెంబర్ల నుంచి అతన్ని టార్చర్ పెట్టడం మొదలు పెట్టారు. ఇలాంటి సైబర్‌నేరాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. అలాగే ప్రజలు కూడా అత్యాశ పడి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా లోను పెడితే మాత్రం మీ చేతులారా మీరే నష్టపోవాల్సి వస్తుంది.

ప్రొద్దుటూరు ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై విచారణకు ఆదేశం

- డాక్టర్ లక్ష్మీప్రసాద్‌కు నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం

కలికిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ లక్ష్మీప్రసాద్ వ్యవహారాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఆయనపై వచ్చిన అభియోగాలపై 10 రోజుల్లోగా సంజాయిషీ పంపుకోవాలని ఈ నోటీసులో ప్రభుత్వం పేర్కొంది. ప్రధానంగా ఆసుపత్రి నిర్వహణలో లక్ష్మీప్రసాద్ పూర్తిగా విఫలమైనట్లు ప్రభుత్వం నిర్ధారకొచ్చింది. రోగులను చేర్చుకోవడంలో, డిస్చార్జి చేయడంలో పారదర్శక విధానాలను, ప్రాధాన్యతలను విస్మరించారని ఆరోపించారు. ఆక్సిజన్ డిమాండు, సరఫరా ల్లో సమతుల్యత లేకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిండం కూడా ప్రభుత్వ ఆగ్రహానికి కారణమయ్యింది. ఆక్సిజన్ మేనేజ్‌మెంట్ కమిటీ, మేనేజ్‌మెంట్ టీములను ఏర్పాటు చేయడంలో విఫలమయ్యాడని కూడా అభియోగం నమోదయ్యింది. ఆసుపత్రి నోడల్ అధికారికి సహకరించడం లేదన్నది మరో ఆరోపణ. ఆక్సిజన్ సరఫరా నిర్వహణ, రోగుల సంఖ్యకు తగ్గట్లు పడకల పెంచకపోవడాన్ని కూడా ప్రభుత్వం తప్పుబట్టింది. ఆసుపత్రి వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించడంలో పారదర్శకత పాటించలేదని, రోగుల అడ్మిషన్లు, డిస్చార్జీలు, మరణాలకు సంబంధించి ఉన్నతాధికారులను తప్పుదారి పట్టించే విధంగా నిర్లక్ష్యంగా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా ఆక్సిజన్ సరఫరాను పర్యవేక్షించడంలో అవసర మైన చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. వీటన్నిటితోపాటు గతంలో 2021 మే 11 నుంచి 2022 మార్చి 21 వరకూ ఎలాంటి సమాచారం లేకుండా గైరుహాజరు కావడంపై కూడా వివరణ సమర్పించాలని ఆదేశిం చారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్ నుంచి సంజాయిషీ అందిన అనంతరం విచారణ కు ఆదేశాలు జారీ చేయనున్నారు. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గతంలో పనిచేసిన సీనియర్ అసిస్టెంట్‌పై చిత్తూరుకు చెందిన జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం చిత్తూరు డీసీహెచ్‌ఎస్ పద్మాంజలిదేవితోపాటు మరో ఇద్దరితో కూడిన బృందం జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. ఇక్కడి మెడికల్ సూపరింటెండెంట్ సుజాతతో కలిసి విచారణ చేపట్టారు. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నాగార్జున అనే వ్యక్తి సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఇక్కడి నుంచి అనంతపురం జిల్లా ధర్మవరంకు బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత అతనిపై పోలీసు కేసు నమోదు అయింది. ఈ క్రమంలో దర్యాప్తుల్లో భాగంగా అతను పనిచేసిన ప్రాంతాలు, వ్యవహార శైలిపై విచారణ చేశారు. ఇక్కడ నాగార్జున పనిచేసిన కాలంలో అతని సర్వీసు రికార్డులను పరిశీలించారు. స్థానిక అధికారులను అడిగి విచారణకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. అంతేకాకుండా ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీపై వెళ్లిన వైద్య సిబ్బంది, అధికారుల అనధికారిక గైర్హాజరుపై కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో ఆర్‌ఎంవో డాక్టర్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన మెలకువలు అత్యంత ఆవశ్యకం

- సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్


మాట్లాడుతున్న రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కాలర్‌లకు పరిశోధన మెలకువలు అత్యంత ఆవశ్యకమని భారత ప్రభుత్వ సైన్స్ టెక్నాలజీ సెంటర్ ఫర్‌పాలసీ రీసెర్చ్‌కు సమన్వయకర్త, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సోషియాలజీ ప్రొఫెసర్ సి.రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం వైఈయూ అన్న మాచార్య సెనేట్ హాల్లో స్కాలర్‌లకు పరిశోధనకు తాత్విక పునాది, పరిశోధన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఆచార్యులు, సహ ఆచా ర్యులు, అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

పులివెందుల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరిలో గుడివెల నాగేష్ (39) అప్పుల బాధ తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. గుడివెల నాగేష్ గత ఐదేళ్ల క్రితం చంద్రగిరిలో రమణమ్మ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. నాగేష్ స్వగ్రామం అనంతపురం జిల్లా గాండ్లపెంట మండలం నరసప్పగారిపల్లె. చంద్రగిరిలో పెళ్లి చేసుకోవడంతో ఇక్కడే కూలి పనులకు వెళ్తూ జీవిస్తున్నాడు. ఇతనికి నాలుగేళ్ల కుమార్తె, భార్య ఉన్నారు. గత నాలుగైదు రోజులుగా నాగేష్ మూడీగా ఉండడంతో భార్య ఆరా తీసింది. అప్పులు ఎక్కువయ్యాయని, అప్పులవారి నుంచి ఒత్తిడి పెరిగిందని భార్యకు తెలిపాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో నాగేష్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

ఓబన్నపేటలో వృద్ధుడు...


ఓబుళరెడ్డి మృతదేహం

కొండాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఓబన్నపేట గ్రామంలో కల్లూరు ఓబు ళరెడ్డి (71) అనే వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. మరుగుజ్జు అయిన ఓబుళరెడ్డి గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. కడుపు నొప్పి తాళలేక శుక్రవారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెంది నట్లు పోలీసులు తెలిపారు. ఓబుళరెడ్డి మరుగుజ్జు కావ డంతో వివాహం చేసుకోలేదు. ఒంటరిగానే ఉంటున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- ముగ్గురికి గాయాలు



గోపవరం/బద్వేలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని నేషనల్ హైవే-67 నూతన బైపాస్ రోడ్డులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక వృద్ధురాలు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. శుక్రవారం బెంగుళూరు నుంచి నెల్లూరు జిల్లా కందుకూరు వెళుతున్న కారు గూడెం-గుంతపల్లె మార్గమధ్యంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడటంతో బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే సంఘటన గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ధర్మాపురం వద్ద రోడ్డు ప్రమాదం

- ఆరుగురికి గాయాలు



గాయపడినవారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో ధర్మాపురం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి 7.20 గంటలకు రోడ్డు ప్రమాదం జరిగింది. వర్షం కురుస్తున్న సమయంలో ప్రొద్దుటూరు వైపు నుంచి ప్రసాద్‌రెడ్డి, నాగేష్ అనే ఇద్దరు ద్విచక్ర వాహనంలో జమ్మలమడుగుకు వస్తుండగా కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. అదే సమయంలో వెనుకవైపు వైపు నుంచి లారీ, బస్సు ఢీకొన్నాయి. ఈఘటనలో ఆర్టీసీ అద్దె బస్సు స్వల్పంగా ముందుభాగందెబ్బతింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న వీరయ్య, జయరాముడు, సింగరయ్యతోపాటు మరికొందరు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ హైమావతి, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో గోవా మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. స్థానిక కడప రోడ్డుకు సమీపంలోని గరుగువీధిలో మద్యం బాటిళ్లు ఉన్నాయన్న సమాచారం మేరకు ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్

- ఏపీఎస్పీడీసీఎల్ ఫోరం చైర్మన్


మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

పులివెందుల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం చేపట్టినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ డివిజన్ ఆఫీస్ కాంపౌండ్ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం రైతులు, ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చొరవ చూపాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి వినియోగదారులు హాజరై తమ సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో ఫోరం మెంబర్లు మధుకుమార్ (ఫైనాన్స్), ఇండిపెండెంట్ మెంబర్ విజయలక్ష్మి, పులివెందుల డివిజనల్ ఇంజనీర్ ప్రసాదరెడ్డి, ఏడీఈ గురుమోహన్‌రెడ్డి, ఏఈలు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ రాని విద్యార్థులకు ష్యూరిటీ బాండ్ ద్వారా ఇవ్వాలి

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ట్రిపుల్‌ఐటీల్లో కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫీజు చెల్లించని కారణంగా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. గత ప్రభుత్వం ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులకు సమస్యలు ఎదుర వుతున్నాయి. ఇలాంటి విద్యార్థులకు ష్యూరిటీ బాండ్ తీసుకొని సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కలెక్టర్‌కు, ఆర్జీయూకేటీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని కారణంగా సర్టిఫి కెట్లు ఇవ్వడం లేదంటూ పలువురు విద్యార్థులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం కడప కలెక్టరేట్‌లో ప్రభుత్వ అంచనాల కమిటీ సమావేశంలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల సమస్యను ప్రస్తావించారు. ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సంద్ర, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తలకు విద్యార్థుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ప్రభుత్వం ఇవ్వని బకాయిలకు ష్యూరిటీ బాండ్లు తీసుకొని సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరగా ఆర్జీయూకేటీ అధికారులు అంగీకరించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

సోలార్ ప్రాజెక్టులో ఉద్యోగావకాశాలు

కడప ఎన్జీఆర్ సర్కిల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహరాష్ట్రలో మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (సోలార్ ప్రాజెక్టు)లో ఉద్యోగావకాశాలు ఉన్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిప్లమా, బీటెక్, డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేసినవారికి సోలార్‌లో అనుభవం ఉన్న యువతకు ఈ ఉద్యోగాలు కల్పించను న్నట్లు ఆమె వివరించారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు ఎల్ఐసీ సర్కిల్ సమీపంలో ఉన్న విశ్వేశ్వరయ్య భవన్‌లో ఇంటర్వ్యూలు జరగనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 6302702399, 7032325252 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

మట్కా ఆడుతున్న ఇద్దరు అరెస్టు

కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలో మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అమర్‌నాధరెడ్డి తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య ఆదేశాల మేరకు నగరంలో దాడులు నిర్వహించి.. మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.6500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రాజారెడ్డి కాలనీలో చోరీ

- బంగారం, డబ్బులు ఎత్తుకెళ్లిన దుండగులు

పులివెందుల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారెడ్డి కాలనీలో నివాసముంటున్న మునిప్రసాద్ ఇంటిలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... లింగాల మండలం లోపట్నూతలకు చెందిన మునిప్రసాద్ తమ పిల్లల చదువుల కోసం రాజారెడ్డికాలనీలో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం 8గంటలకు తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడు స్కూల్‌కు వెళ్లగానే మునిప్రసాద్ తన భార్య లోపట్నూతలలోని పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో మునిప్రసాద్ కుమార్తె స్కూల్ నుంచి ఇంటికి వచ్చింది. ఆ సమయంలో ఇంటికి ఉన్న బీగాన్ని పగులగొట్టి, బీరువాలో ఉన్న బట్టలు చిందరవందరగా ఉండడం చూసింది. వెంటనే తండ్రికి తెలియజేయడంతో ఆయన వచ్చి పరిశీలించగా. .. 40గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.40లక్షలు విలువైన వెండిని చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ విష్ణునారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ పాప సంబంధీకులు ఉంటే... సంప్రదించండి

- జిల్లా బాలల పరిరక్షణ అధికారి



కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 15 నెలలు వయసు గల ఆడపాపను గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 17వతేదీ ఆర్టీసీ బస్టాండులో వదిలిపెట్టి వెళ్లినట్లు జిల్లా బాలల పరిరక్షణ అధికారి డీఆర్ సుభాష్‌యాదవ్ తెలిపారు. ఈ విషయం తెలిసి కారుణ్య ఫౌండేషన్ వారు ఆ పాపను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. విషయం తెలుసు కున్న జిల్లా బాలల పరిరక్షణ విభా గం ఐసీడీఎస్ అధికా రులు కారుణ్య ఫౌండేషన్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ పాప ప్రత్యేక దత్తత సంస్థలో ఆశ్ర యం పొందుతోంది. ఎవరైనా ఆ పాప తల్లిదండ్రులు కానీ రక్తసంబంధీకులు కానీ తగిన ఆధారాలతో సంప్రదించాలని ఆయన తెలిపారు.

శ్రీశైలం బస్సు రాకకోసం..

- బస్టాండ్‌లో ప్రయాణీకుల పడిగాపులు
- రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరిన బస్సు

కడప మారుతీనగర్, నవంబరు 21 (మారుతీనగర్): కడప డిపో నుంచి శ్రీశైలం బయలుదేరాల్సిన ఆర్టీసీ బస్సు ఆలస్యంగా బస్టాండ్‌కు చేరుకోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 1-30 గంటలకు బయలుదేరాల్సిన బస్సు 3-30 గంటలకు (దాదాపు 2 గంటలు ఆలస్యంగా) బస్టాండుకు చేరుకోవడంతో ప్రయాణీకులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. కడప డిపో నుంచి శ్రీశైలానికి ప్రతిరోజూ రెండు బస్సులు తిప్పుతున్నారు. అందులో ఒక బస్సు తెల్లవారు జామున 5 గంటలకు, మరో బస్సు మధ్యాహ్నం 1-30కి శ్రీశైలానికి కడప డిపో నుంచి బయలు దేరుతాయి. అయితే శుక్రవారం కడప డిపో నుంచి మధ్యాహ్నం 1-30కు బయలు దేరాల్సిన ఏపీ04జెడ్-0305 నెంబర్ గల ఎక్స్‌ప్రెస్ బస్సు డిపో నుంచి బస్టాండుకు రాలేదు. బస్సు ఎంత సేపటికీ బస్టాండ్‌కు చేరుకోకపోవడంతో ప్రయాణీకులు ఎంక్వయిరీ (విచారణకేంద్రం) దగ్గరకెళ్లి ఆరా తీశారు. అయితే వారికి సరైన సమాధానం రాలేదు. దీంతో బస్సు కోసం వేచి ఉన్న దాదాపు 40 మంది ప్రయాణీకులలో సగం మంది ఇంటికెళ్లిపోయారు. చివరకు మధ్యాహ్నం 3-30కి గ్యారేజీ నుంచి బస్సు బస్టాండ్‌కు చేరుకుంది. దీంతో మిగిలిన 24 మందితో ఆ బస్సు శ్రీశైలానికి బయలుదేరింది. ఈ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసి అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. కాగా బస్సు స్ప్రింగ్ ప్లేట్స్ కట్ కావడంతో గ్యారేజీలో మరమ్మతులు చేసినట్లు తెలుస్తోంది. ఈ కారణంగా బస్సు ఆలస్యంగా బస్టాండ్‌కు వచ్చినట్లు సమాచారం.


శ్రీశైలం బస్సు రాక కోసం కడప డిపోలో వేచివున్న ప్రయాణీకులు

సమస్యల పరిష్కారమే కూటమి లక్ష్యం

● కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో పలు సమస్యలపై ప్రజల నుంచి భారీగా వినతిపత్రాలు అందాయని, వాటిపై అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించామన్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లోని పలు సమస్యలను ఈ 17 నెలల్లో చాలా వరకు పరిష్కరించామన్నారు. రాబోవు మూడున్నరేళ్లలో రైల్వేకోడూరును అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరాజుపేట అప్పా జ్యూస్ పరిశ్రమ పునరుద్ధరణ, కోడూరు-వెంకటగిరి రోడ్డు, పెనగలూరు వద్ద సోమశిల బ్యాక్‌వాటర్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు, కోడూరు రైతుల కోసం శీతల గిడ్డంగుల ఏర్పాటు, రైల్వేకోడూరును ఉద్యాన హబ్‌గా మార్చడం, ఉద్యాన పంటల ఆధారిత పరిశ్రమలను నెలకొల్పడం వంటివి చేసి చూపిస్తామని తెలిపారు. రైల్వేకోడూరు లో 108 వాహన సిబ్బంది ఉంటున్న భవనం వర్షాకాలంలో ఉరుస్తుందని సిబ్బంది విన్నవించగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, రైల్వేకోడూరు క్లస్టర్ ఇన్‌చార్జి పఠాన్ మౌలా, కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, నూరపు రాజు సుబ్బరాజు, మలిశెట్టి మురళీధర్‌గౌడు, నార్జాల హేమరాజ్, పోతురాజు సుమన్ తదితరులు పాల్గొన్నారు.



కుడా చైర్మన్ రూపానందరెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకుంటున్న ముస్లింలు

వంద కుటుంబాలు టీడీపీలో చేరిక

పెనగలూరు: మండలంలోని ఈటమాపురం గ్రామ పంచాయతి పరిధిలోని నాయుడువారిపల్లె, మూగవారిపల్లెకు చెందిన సుమారు 100 కుటుంబాలు శుక్రవారం కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. మాజీ సర్పంచ్ రామిరెడ్డితోపాటు నాయుడువారిపల్లెకు చెందిన ఎస్.మహబూబ్ బాషా, అచ్చులు మౌలాలి, సర్దార్‌హుస్సేన్, చిన్న అల్లాబకష్, అచ్చుల రహిమాన్, వెంకటేష్‌నాయుడు, అమీర్, ఎస్.రాఘవరెడ్డి, పిచ్చిరెడ్డి, హిదయతుల్లా, రిజ్వాన్, రెహమాన్, అమీర్, మస్తాన్ తదితరుల ఆధ్వర్యంలో ముస్లిం కుటుంబాలు టీడీపీ కండువా కప్పుకున్నాయి. నాయుడువారిపల్లెలో షాదీఖానా నిర్మాణం, నీటిశుద్ధి కేంద్రం, శ్మశానానికి దారి, గ్రామంలో సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయాలని రూపానందరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. బీఎల్ నరసింహారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చకాయల రవికుమార్, దాసరి దామోదర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం.. తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం!

రాయచోటిటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం చేకూరుతుందని ప్రకృతి వ్యవ సాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ తెలిపారు. శుక్రవారం రాయచోటి మండల పరిధి లోని జంగంరెడ్డిగారిపల్లెలో డీపీయం ఆధ్వర్యంలో మహిళా రైతు జయమ్మకు చెందిన వేరుశనగ పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వేరుశనగ పంట సాగు చేయ డంతో పెట్టుబడి ఖర్చులు గణనీయంగా తగ్గి భూసారం పెరిగి దిగుబడి కూడా ఎంతో మెరుగు పడుతున్నట్లు తెలిపారు. ఈ వేరుశనగ ఏ- గ్రేడ్ మోడల్‌లో అంతర పంటల ద్వారా అదనపు ఆదాయంతో పాటు , పంట కోత ప్రయోగంలో 8.50 కిలోల వేరుశనగ కాయలు లభించాయని, దీని ఆధారంగా ఎకరాకు సుమారు 22 బస్తాల దిగుబడి అంచనా వేసినట్లు తెలిపారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగుపెట్టి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందాలని, ఆరోగ్యకరమైన ఆహారం పండించాలని రైతులకు సూచించారు. రైతు జయమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారులు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

● ఎంఈవోలకు నోటీసు అందజేసిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



సమ్మె నోటీసు అందజేస్తున్న సమగ్ర సర్వశిక్ష సిబ్బంది

పెనగలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తమ న్యా యమైన సమస్యలు పరిష్క రించాలంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం పెన గలూరు ఎంఈవో-1 గిరి వరదయ్య, ఎంఈవో-2 టి. నాగసుబ్బారెడ్డిలకు సమ్మె నో టీసు ఇచ్చారు. ఈనెల 24న జిల్లా కేంద్రాల్లో, డిసెంబరు నెల 10న విజయవాడలోని ఎస్పీడీ వద్ద ధర్నా చేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేయనున్నట్లు సీఆర్పీలు జి.సుజాత, శశికళ, నరసింహులు, పాదుషా, ఎంఐఎస్‌కే విజయకుమార్, సీవో ఆపరేటర్ రాజేశ్వరి, కార్యాలయ అటెండర్ సుబ్బరాయుడు తెలిపారు. సమగ్ర శిక్షలో విధులు నిర్వహించే అన్ని కేటగిరీల సిబ్బందికి హెచ్ఆర్‌పి పాలసీ వెంటనే అమలు చేయాలని, మినిమం టైం స్కేల్ రూపొందించాలని ఈపీఎఫ్, ఈఎస్ఐ హెల్త్ బెనిఫిట్, మెడికల్ లీవులు, చైల్డ్‌కేర్ లీవులు అందించాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, గతంలో జరిగిన సమ్మె ఒప్పందాలను పూర్తిగా అమలు చేయాలని, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు,

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఒంటిమిట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎరువులను అధిక ధరలకు విక్ర యించే డీలర్లపై చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి మంజులరాణి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు డీలర్లు వెంకటేశ్వర్లు, పీరుల్లా, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం కోర్టులో లోక్ అదాలత్

ఒంటిమిట్ట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సిద్దవం కోర్టులో శుక్రవారం జడ్జి విజయలక్ష్మి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. సీఐ నరసింహరాజు, ఒంటిమిట్ట ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, సిద్దవటం ఎస్ఐ షఫీ, అట్లూరి ఎస్ఐ రామకృష్ణ, కోర్టు కానిస్టేబుల్ నాగేంద్రరాజు పాల్గొన్నారు.

మంగంపేటలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

ఓబులవారిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మంగంపేట ఆర్ఆర్-01లో కనకదుర్గమ్మ, గంగమ్మ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం యాగశాల ప్రారంభం, ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని పురోహితుడు కనక రత్నాచార్యులు తెలిపారు. ప్రతిరోజు గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తామని, ధర్మకర్త మంగారపు గంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

రాయచోటిటౌన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): రాయచోటి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) యుగంధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించే లక్ష్యం తో ఈ నెల 22వ తే దీ శనివారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు రాయచోటి పట్టణంలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ మెయింటెనెన్స్ చేయచున్నా మన్నారు . రాయచోటి పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఏవైనా సమస్యలు ఉంటే విద్యుత్‌శాఖ డీఈ 9440814298, ఈస్ట్ ఏఈఈ 9440814300, లైన్ ఇన్స్‌పెక్టర్ బీ. నరసింహులునాయక్ 9154789280, లైన్ ఇన్స్‌పెక్టర్ బీ. చంద్రబాబునాయక్ 9154789270, లైన్ ఇన్‌స్పెక్టర్ బాలూనాయక్ 9154789269, వెస్ట్ ఏఈఈ 9440814299, ఇన్‌స్పెక్టర్ వెంకట్రమణ 9154789282, సీ. రాజ్‌కుమార్ 9154789283 లను సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం

చిన్నమండెం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన మండలం లోని కేశాపురం గ్రామం సుద్దలగుట్టపల్లెకు చెందిన శేఖర్‌కు మంత్రి మండిపల్లి ఆర్థికసాయం అందించారు. ఎంఎస్ఆర్ ట్రస్ట్ సభ్యులు శుక్రవారం రాత్రి రూ.20 వేలు అందజేసినట్లు టీడీపీ నాయకుడు మూగి రెడ్డప్ప తెలిపారు.

నారా లోకేశ్‌తో చమర్తి భేటీ

రాజంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం రాజంపేట నియోజకవర్గ టీ డీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు కలిశారు. ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గంలోని పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ఎన్డీయే కూటమి బలోపేతానికి కృషి చేయాలని, సంక్షేమ పథకాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని మంత్రి సూచించినట్లు జగన్‌మోహన్‌రాజు తెలియజేశారు.



మంత్రి నారా లోకేశ్‌తో చమర్తి జగన్‌మోహన్‌రాజు

రైల్వేకోడూరు రూరల్ సీఐ గా శ్రీనివాసులు



రైల్వేకోడూరు, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): రైల్వేకోడూరు రూరల్ సీఐగా డి. శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రైల్వేకోడూరు అర్బన్ సీఐగా పని చేస్తున్న కే. హేమసుందరరావు పోరుమామిళ్ల సీఐగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమా లను అరికట్టడానికి తన వంతు కృషి చేస్తామన్నారు.

సీఐకి సన్మానం

రైల్వేకోడూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు అర్బన్ సీఐ చంద్రశేఖర్‌ను శుక్రవారం మండల బీజేపీ అధ్యక్షుడు సాయం శ్రీధర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తోట శ్రీనివాసులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వాకచర్ల సుబ్బారావు, మండల ప్రధాన కార్యదర్శి కుప్పాల కిరణ్, మీడి యా కన్వీనర్ కుంభకోణం సాయిఆచారి, మండల మాజీ ఉపాధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, బాబు ఆచారి, మహిళా నాయకురాలు కుప్పాల జ్యోతి తదిత రులు పాల్గొన్నారు.

పుస్తకాలతో విజ్ఞాన సముపార్జన

నందలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చునని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మం డల విద్యాశాఖాధికారి అనంత కృష్ణ, నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. మండలంలోని అరవపల్లె గ్రంథాలయంలో శుక్రవారం 58వ గ్రంథాలయ వార్షికోత్సవ ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రైల్వేకోడూరు లో వర్షం

రైల్వేకోడూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఒక మోస్తరు వర్షం కురిసింది. పాదచారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానదారి, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు ప్రవహించింది. తిరుపతి-కోడూరు, పెనగలూరు :మండలంలోశుక్రవారం తెల్లవారుజాము నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. పది నిముషాలకోసారి విడతలు విడతలుగా వర్షం కురిసింది.

ఎస్‌హెచ్‌జీల బలోపేతానికి కృషి చేయాలి

రామాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల బలోపేతానికి వీవోఏలు కృషి చేయాలని రామాపురం మండల ఏపీఎం దేవసేవ అన్నారు. శుక్రవారం రామాపురంలోని స్వయంసహాయక కార్యాలయంలో వీవోఏల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రుణాలు చెల్లించక సిక్ అయిన సంఘాలను పునరుద్ధరించాల్సిన బాధ్యత సంఘం లీడర్లు, వీవోఏల పైనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు నాగరాజు, గంగాధరాజురెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో అన్నదానం

రాయచోటిటౌన్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): పట్టణానికి చెందిన మణి కంఠేశ్వర్‌రెడ్డి మేనకోడలు చిన్నారి హని జ్ఞాపకార్థం శుక్రవారం స్థానిక భవిత కేం ద్రంలో అన్నదానం చేసినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ అధ్యక్షుడు పసుపులేటి శ్యామ్ తెలిపారు. క్లబ్ రీజనల్ చైర్మన్ లయన్ షేక్. మహమ్మద్, ఉపాధ్యక్షుడు లయన్ హరీశ్‌చంద్, భవి త కేంద్రం, సిబ్బం ది త్రిలోక్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటు



మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి సుస్మిత

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారిణి సుస్మిత తెలిపారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాయచోటిలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారులు ఆహార భద్రత, ఆర్థికాభివృద్ధి, జలవనరుల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని, రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల ప్రతినిధులు, మత్స్య రైతులు, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ ప్రోగ్రాంలో పాల్గొన్నడీపీవో రాధమ్మ

రాయచోటి(నేతాజీ సర్కిల్), నవంబరు21(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్ర త మన అందరి బాధ్యత అని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ తెలిపారు. శుక్రవారం దేవపట్ల గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవపట్ల గ్రామం మెయిన్ రోడ్డు హాస్పిటల్ ప్రాంతంలో పారి శుధ్య కార్మికులతో పాటు అధికారులతో కలిసి క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ ప్రో గ్రాంలో పాల్గొన్నారు. శానిటేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించినప్పుడు వ్యాధులు దూరమవుతాయని తెలిపారు. స్వచ్ఛత మనందరిలో ఓ భాగం కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంబేపల్లె ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో సునీల్‌కుమార్, అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండలంలో ఉన్న అన్ని గ్రామాల గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్లు పాల్గొన్నారు.

ఆలయాల మధ్యలో చర్చి నిర్మాణ పనులు ఆపాలి



ఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న హిందూ ధర్మ పరిరక్షణ సభ్యులు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల మధ్యలో చర్చి నిర్మాణ పనులు నిలిపివేయాలని హిందూ ధర్మ పరిరక్షణ సంస్థ ప్రతినిధులు, అయ్యప్ప గురుస్వామి వెంకట్రమణ, బీజేపీ సీనియర్ నాయకుడు కృష్ణ శుక్రవారం స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర బాబు, తహసీల్దార్ క్రాంతికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లెలోని లక్ష్మీ నరసింహస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలు, హిందూ శ్మశాన వాటికల మధ్యలో చర్చి ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు. ఈ ప్రాంతమంతా హిందువులు ఉన్నారని, మతాల మధ్య చిచ్చు పెట్టకూడదని అధికారులకు నివేదిస్తు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు యనమల విశ్వనాథ్, సుబ్బరాయుడు, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, ప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వేతో వ్యాధిగ్రస్తులను గుర్తిద్దాం

● అదనపు జిల్లా ఆరోగ్య వైద్యాధికారి రాధిక



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాధిక

రాయచోటి నేతాజీ సర్కిల్ , నవంబరు 21(ఆంధ్రజ్యోతి): లెప్రసీ సర్వేతో వ్యాధిగ్రస్తులను గుర్తిద్దామని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాధిక తెలిపారు. శుక్రవారం సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గున్నికుంట్ల ఉప కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి ఇంటిలోని వ్యక్తులకు ఏవైనా రాగిరంగు మచ్చలు ఉన్నాయా అని గుర్తించాలని సిబ్బందికి సూచించారు. కాలివేళ్ల గానీ, చేతులు గానీ తిమ్మిర్లు ఉన్నాయా అని అడిగి తెలుసు కోవాలని ఆమె తెలిపారు. ఆశాలు సర్వేని నిక్కచ్చిగా చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, ఏఎన్ఎం సంధ్య, ఆశావర్కర్ అనూషా తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో అనంతరాజుపేట విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న అనంతరాజుపేట విద్యార్థులు

రైల్వేకోడూరురూరల్, నవంబ రు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15, 16, 17 తేదీల్లో గుంటూరు జిల్లా వినుకొండలో నిర్వహించిన అండర్-19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అనంతరాజు పేట ప్రభుత్వ హైస్కూలు విద్యార్థులు ధరణి, శృతి తదితరులు విశేష ప్రతిభ ను కనబరిచారని ప్రధానో పాధ్యాయురాలు లలితకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్రబాబు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పిల్లలు కబడ్డీలో బాగా రాణించాలని ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు క్వార్టర్ ఫైనల్స్‌లో ఓటమి పాలయ్యారన్నారు.

24 నుంచి భగవద్గీత ప్రవచనాలు

నందలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరవపల్లె శ్రీకృష్ణగీతా మందిరంలో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు సాయంత్రం 6 గంటల నుంచి 730గంటల వరకు శ్రీమద్భగవద్గీత ఏడవ అధ్యాయం జ్ఞాన విజ్ఞాన యోగం ప్రవచనం నిర్వహిస్తున్నట్లు కడప చిన్మయమిషన్ మాజీ సెక్రటరీ నాయనపల్లి జయన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవాచకులు అచ్చోలు ముకుందరెడ్డి, పోతన సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్, టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటార న్నారు. ఆయా కార్యక్రమాలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నిత్యపూజేశ్వరకోనలో వ్యర్థాల తొలగింపు

సిద్దవటం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరి ధిలోని నిత్యపూజేశ్వరకోనలో పోగుపడిన వ్యర్థాలను శుక్ర వారం కూలీల సాయంతో అ ధికారులు తొలగించారు. పం చలింగాల గుడి వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించా రు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ జింగిటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో రావడంతో సన్నిధానం, పంచలింగాల గుడి సమీపంలో పోగుపడిన వ్యర్థాలను పూర్తిగా తొలగించామని తెలిపారు. మహిళల సౌకర్యార్థం టాయిలెట్, స్నానపు గదుల నిర్మాణం విషయం ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లామని త్వరలో పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది చంద్ర, కూలీలు పాల్గొన్నారు.

'విలువలు లేని విద్య నిరుపయోగం'

రాయచోటిటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విలువలు లేని విద్య సమాజానికి ఎంత మాత్రం మంచిది కాదని మానవత సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, అధ్యక్షుడు అంకం జయ చంద్రారెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ చింతం వెంకట్రా మిరెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నైతిక విలువలపై ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు

చెయ్యేరుపై బ్రిడ్జి నిర్మించేదెప్పుడో ?

● 3 కి.మీ. దూరానికి 30 కి.మీ. ప్రయాణం ● పెనగలూరు, నందలూరు మండల ప్రజలకు అగచాట్లు



నీటి ప్రవాహంలో పాడైన రోడ్డుపై తాత్కాలిక ప్రయాణాలు సాగిస్తున్న ప్రజలు

పెనగలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు-నందలూరు మండలాల మధ్య ప్రవహిస్తున్న చెయ్యేరునదిపై హైలెవల్ బ్రిడ్జి లేక రెండు మండలాల ప్రజల ప్రయాణాలు నరకయాతనగా మారాయి. పెనగలూరు మండలం ఓబిలి గ్రామం ద్వారా నందలూరు మండలం టంగుటూరు గ్రామం ద్వారా రెండు మండలాలను కలుపుతూ చెయ్యేరునదిపై ఉన్న మట్టిరోడ్డుపైనే ఇరువైపులా 30 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నారు. వర్షాలు బాగా వచ్చినప్పుడల్లా ఈ మట్టిరోడ్డు మధ్యలో కొంతదూరం కొట్టుకు పోవడం.. నీరు తగ్గినప్పుడు రెండు మండలాల అధికారులు, నాయకులు మరలా తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేయడం జరుగుతూ వస్తోంది. మట్టిరోడ్డు కొట్టుకుపోతే చుట్టూ 30 కి.మీ. తిరిగి వెళ్లాల్సి వుంటుంది. ఈ మట్టిరోడ్డు స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని రెండు దశాబ్దాలుగా నాయకులు అధికారులతో ప్రజలు పోరాటం చేస్తున్నప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మయ్య హయాంలో రూ.4 కోట్ల వ్యయంతో లోలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా ఆర్అండ్బీ శాఖ ద్వారా నిధులు మంజూరైనప్పటికీ టెండర్లు పిలవకపోవడంతో అప్పట్లో ఆ పనులు ఆగిపోయాయి. అప్పటి నుంచి మరలా బ్రిడ్జి నిర్మాణానికి రెండు మండలాల్లోని 30కి పైగా గ్రామాల ప్రజలు, నాయకులు అధికారులకు విన్నవిస్తున్నా బ్రిడ్జి నిర్మాణ పనులు కార్యరూపం దాల్చలేదు.

2019-24 మధ్యకాలంలో రాజంపేట ఎమ్మెల్యే సహకారంతో చెయ్యేటిలో ఉన్న మట్టి రోడ్డును పటిష్టం చేస్తూ మరలా రోడ్డు నిర్మించారు. అయితే 2021లో అన్నమయ్య డ్యామ్ తెగిపోవడంతో మట్టిరోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. అప్పటి నుంచి కొట్టుకుపోయిన మట్టిరోడ్డు స్థానంలో మరలా రోడ్డు నిర్మించారు. అయితే నెల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు చెయ్యేటిలో వరదనీరు పారుతుండడంతో మట్టిరోడ్డు పలుచోట్ల కొట్టుకుపోయింది. చెయ్యేటిలో తరచుగా నీటి ప్రవాహం పెరుగుతూ తగ్గుతూ ఉండడం వల్ల మట్టిరోడ్డు పునఃనిర్మించేందుకు అవకాశం లేకుండా పోయింది. అందువల్ల నీటిలో లోతు తక్కువగా ఉన్న ప్రదేశాల నుంచి రెండు వైపులా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఓబిలి-టంగుటూరు మధ్యలో చెయ్యేటి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పెనగలూరు మండలం లోని ఓబిలి, అతిగారిపల్లె, బెస్తపల్లె, సిద్దవరం, ఇండ్లూరు, కొత్తపల్లె, సత్తుపల్లె గ్రామాల ప్రజలతో పాటు నందలూరు మండలంలోని టంగుటూరు, పాచికాలువ, లేబాక, చింతకాయలపల్లె, కొమ్మూరు, కోనాపురం, నల్లతిమ్మాయపల్లె తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే ఉపయోగకరం



ఓబిలి-టంగుటూరు గ్రామాల మధ్యలో చెయ్యేటి నదిపై ప్రభుత్వం హైలెవల్ వంతెన నిర్మిస్తే రెండు మండలాల్లోని 30 గ్రామాల ప్రజల ప్రయాణాలకు ఉపయోగంగా ఉంటుంది. చాలా కాలంగా చెయ్యేటి నదిలో బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వంతో పోరాడు తున్నాం. అది కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హైవే బ్రిడ్జి నిర్మించాలి.

- ఎస్.అమీరుల్లా, ఓబిలి గ్రామ టీడీపీ ఇన్చార్జి

నిధులు నిష్ప్రయోజనం అయ్యాయి



మాజీ ఎమ్మెల్యే, చిన్ననీటి తరహా మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య హయాంలో తాను ఓబిలి సర్పంచ్గా ఉన్నాను. తన హయాంలో చెయ్యేటి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలనే ఉద్దేశ్యంతో పట్టుబట్టి బ్రహ్మయ్య ద్వారా రూ.4 కోట్లు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాం. కొన్ని రాజకీయ కారణాల వల్ల టెండరు ప్రక్రియ దాకా రాలేదు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు స్పందిస్తే బాగుంటుంది.

- ఎస్.హబీబుల్లా, మాజీ సర్పంచ్, ఓబిలి

ఆ నిర్మాణాలకు అనుమతి లేదు..

- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

బి.కొత్తకోట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు రోడ్డు గంగమ్మ మాన్యం పక్కన నిర్మిస్తున్న షెడ్లకు తమ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులు లేవని నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి ప్రకటించారు. రూ.కోట్ల విలువైన ఈ వివాదాస్పద స్థలంలో హక్కు తమదంటే, తమదంటూ ఇరు వర్గాలూ పోటీ పడుతున్నాయి. ఇందులో బలమైన వర్గం అన్ని శక్తులూ ప్రయోగించి షెడ్ల నిర్మాణం చేపట్టి దాదాపుగా ముగించింది. ఇందులో భూమి హక్కులు ఎవరికున్నా నిర్మాణాలకు నగర పంచాయతీ, టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతులు తప్పనిసరి. అయితే ఎటువంటి అనుమతులూ లేకుండా నిర్మాణాలు చేపట్టారు. వాటిని తక్షణం ఆపాలంటూ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. అయినా వాటిని బేఖాతరు చేస్తూ నిర్మాణాలు చేపట్టారు. ఓ వైపు నిర్మాణాలు జరుగుతూనే వుండగా మరోవైపు ప్రత్యర్థి వర్గం వాటిని ఆపడానికి విశ్వప్రయత్నాలు చేస్తూనే వుంది. ఈ క్రమంలో నిర్మాణ స్థలం వద్ద జరిగిన గొడవలకు సంబంధించి బి.కొత్తకోట స్టేషన్లో ఈనెల 19న ఓ వర్గానికి చెందిన గడ్డం క్రిష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు డేరంగుల ఓబులేసుపై కేసు నమోదైంది. అయితే ఈ నెల 20న ఓబులేసు అనే వ్యక్తి వివాదాస్పద స్థలం వద్దకు వచ్చి మరోసారి దాడి చేసి మళ్లీ గాయపరిచాడని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ విషయమై కమిషనర్ మాట్లాడుతూ ఒకసారి నోటీసులు ఇస్తే నిర్మాణాలు ఆపకుండా తమ వద్దనున్న కాగితాలు తెచ్చి చూపించారని, అవి సక్రమంగా లేవన్నారు. మేము వెళ్లి పరిశీలించినప్పుడు పనులు ఆపుతారు.. మేము వెళ్లగానే మళ్లీ కడుతున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాము. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

మార్కెట్ కమిటీ స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణం



ఆయిల్ సీడ్స్ వద్ద సర్వే చేస్తున్న ఏఎంసీ చైర్మన్, డీఈ

పీలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పీలేరు-తిరుపతి మార్గంలోని ఆయిల్ సీడ్స్ వద్దనున్న రెండెకరాల పీలేరు మార్కెట్ కమిటీ స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టనున్నట్లు ఏఎంసీ అధ్యక్షుడు పురం రామ్మూర్తి తెలిపారు. ఆయిల్ సీడ్స్ వద్ద పీలేరు మార్కెట్ కమిటీకి గతంలో ప్రభుత్వం రెండెకరాల స్థలం కేటాయించింది. వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా టీడీపీ నేతల ప్రతిఘటనతో వెనక్కు తగ్గారు. ఏఎంసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పురం రామ్మూర్తి ఆ స్థల పరిరక్షణకు ప్రహరీ గోడ నిర్మించాలని ఉన్నతాధికారులకు విన్నవించడమే కాకుండా ఇటీవల పీలేరు పర్యటనకు వచ్చిన మార్కెటింగ్ శాఖ కడప రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఆదేశాల మేరకు శుక్రవారం మార్కెటింగ్ శాఖ డీఈ మేఘనాథం సందర్శించారు. స్థల పరిశీలన జరిపి ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రాథమిక సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీల ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే ప్రహరీ గోడ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి హరినాథ్, సూపర్వైజర్ భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

వివాహమైన మూడు నెలలకే విగతజీవిగా..



ఆత్మహత్య చేసుకున్న లావణ్య

మదనపల్లె అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వివాహమై మూడు నెలలు గడవకనే ఓ వివాహిత జీవితం ముగిసింది. తాలుకా పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె మండలం, బసిని కొండ గ్రామం, పుంగనూరు రోడ్డుకు చెందిన వెంకటేశ్కు, మదనపల్లె మండలం, బండకాడపల్లెకు చెందిన లావణ్య(18)తో పెద్దల సమక్షంలో రెండున్నర నెలల క్రితం వివాహం జరిపించారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ శుక్రవారం రాత్రి ఇంట్లోనే తన చీరకు ఉరేసుకుని వేలాడుతూ లావణ్య కనిపించింది. కుటుంబ కలహాలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ మేరకు మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాక్ అసెంబ్లీకి ఏడుగురు విద్యార్థులు ఎంపిక

● జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం



విద్యార్థులతో డీఈవో సుబ్రహ్మణ్యం తదితరులు

రాయచోటిటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న అమరావతిలో నిర్వహించనున్న మాక్ అసెంబ్లీలో పాల్గొనేందుకు అన్నమయ్య జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శాసన సభ సమావేశాల నిర్వహణ, ప్రశ్నోత్తరాల సమయం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్ విధులపై అవగాహన కల్పించారు. ఎంపికైన విద్యార్థుల్లో నిమ్మనపల్లి మండలం రాచవీటిపల్లి జడ్పీ హైస్కూల్కు చెందిన పార్థసారథి, పీలేరు మండలం ఎంజేపీ పాఠశాలకు చెందిన తేజశ్రీ, బి.కొత్తకోట మండలం బాలుర జడ్పీ హైస్కూల్ విద్యార్థి అనిల్కుమార్, రాయచోటి మండలం మాసాపేట జడ్పీ హైస్కూల్కు చెందిన సుష్మతాజ్, వీరబల్లి మండలం జడ్పీ హైస్కూల్కు చెందిన కొల్లి వీక్షిత, పెనగలూరు మండలం ఏపీ మోడల్ స్కూల్కు చెందిన నూర్ ఆయేషా, రాజంపేట మండలం బోయినపల్లి జడ్పీ హైస్కూల్కు చెందిన పట్నం రెడ్డిసాయి ఉన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి మాక్ అసెంబ్లీలో పాల్గొనే అద్భుత అవకాశం మన జిల్లాకు చెందిన విద్యార్థులకు లభించడం గర్వకారణమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు ప్రజాస్వామ్య విలువలు, శాసన వ్యవస్థపై అవగాహన పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్స్ శివారెడ్డి, రామలక్ష్మి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఏపీవో చంద్రశేఖర్, ఏఎస్వో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్లో ఇబ్బందులు లేకుండా రీసర్వే

● పైలట్ ప్రాజెక్టును పరిశీలించిన రాష్ట్ర సర్వేశాఖ డిప్యూటీ డైరెక్టర్



పెంచుపాడు గ్రామం వద్ద రీసర్వే వివరాలను తెలుసుకుంటున్న గౌస్బాషా, భరత్

మదనపల్లెటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్లో గ్రామాల హద్దులు, రైతుల భూముల హద్దుల గుర్తింపులో ఇబ్బందులు లేకుండా మూడో విడత రీసర్వే నిర్వహిస్తున్నామని రాష్ట్ర సర్వేశాఖ డిప్యూటీ డైరెక్టర్ గౌస్బాషా పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండలం పెంచుపాడు వద్ద జరుగుతున్న రీసర్వే పనులను జిల్లా సర్వే ఏడీ భరత్తో కలిసి డిప్యూటీ డైరెక్టర్ పరిశీలించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా పెంచుపాడు గ్రామంలో మూడో విడత సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వచ్చామన్నారు. ఇక్కడ వచ్చే సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించాలో తదితర విషయాలను జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. రైతులందరి సమక్షంలో ఈ సర్వే చేయించడంతో పాటు, సర్వే విషయాలను గ్రామ సభలు నిర్వహించి రైతుల ఆమోదంతోనే రికార్డుల్లోకి ఎక్కిస్తామన్నారు. పాత విలేజ్ మ్యాపుల ఆధారంగా రీసర్వే నిర్వహించడంతో పాటు దారి సమస్యలు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ స్థలాలు, వాగులు, వంకలు ఆక్రమణలను గుర్తించడం, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ముఖ్యంగా వాటర్ బాడీస్ ఆక్రమణలను ఉపేక్షించేది లేదన్నారు. పెంచుపాడు పంచాయతీ తేనెటీగలపల్లె, గొల్లపల్లె హ్యాబిటేషన్లలో భూమి జాయింట్ హద్దుల సమస్యలు వున్నాయని రైతులు గౌస్బాష దృష్టికి తీసుకెళ్లడంతో వాటిని దగ్గరుండి పరిష్కరించాలని మండల సర్వేయర్ సుబ్రమణ్యంను ఆదేశించారు. కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

గుండ్లపల్లెను మోడల్ విలేజ్గా తయారు చేద్దాం

● ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఫోర్డు సంస్థ డైరెక్టరు లలితమ్మ

తంబళ్లపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లెను ప్రకృతి వ్యవసాయంలో మోడల్ విలేజ్గా తయారుచేసి మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుపుదామని ఫోర్డు సంస్థ డైరెక్టరు లలితమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ అంజనప్ప, ఏపీ సీఎన్ఎఫ్(ఏపీ రైతు సాధికార సంస్థ) సిబ్బందితో కలసి ప్రకృతి వ్యవసాయంపై ఉపయోగాలు, ఆవశ్యకత, రైతుల బీడు భూములను వ్యవసాయ భూములుగా మార్చడం, మొక్కలు నాటడం, నీటి కుంటల ఏర్పాటు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ థామస్రాజ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, మన పూర్వీకుల్లా సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వైపు రైతులు దృష్టి పెట్టాలన్నారు. ఏపీఎఫ్ ప్రాజెక్ట్ కన్సల్టెంట్ డాక్టర్ ప్రహ్లాద మాట్లాడుతూ గుండ్లపల్లె పంచాయతీలోని పాపిరెడ్డిగారిపల్లె, చెట్లవారిపల్లె, గుండ్లపల్లె గ్రామాలను ప్రకృతి వ్యవసాయానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫోర్డు సిబ్బంది వీవీ రమణ, సంపూర్ణ, హేమంత్కుమార్ వ్యవసాయ శాఖ సిబ్బంది సుప్రియ, రైతు సాధికార సంస్థ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్బాల్ విజేతలు.. వైజాగ్, అనంతపురం జట్లు

మదనపల్లెఅర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా మదనపల్లె మండలం, పుంగనూరు రోడ్డులోని గ్రీన్వ్యాలీ స్కూల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య, చంద్రమాకులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 బాలుర విజేతలుగా వైజాగ్, బాలికల విజేతలుగా అనంతపురం జట్లు నిలిచాయని ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్బాబు, అడ్మిన్ కార్యదర్శి శారద, ఆర్గనైజింగ్ కార్యదర్శి మురళీధర తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్బాష విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఏపీ స్కూల్ గేమ్స్ అండర్-14 జట్లకు ఎంపిక చేసినట్లు అబ్జర్వర్ పాల్ తెలిపారు.

10 మంది పేకాటరాయళ్లు అరెస్టు

● రూ.24,640 నగదు, బైకులు, ఆటో స్వాధీనం

మదనపల్లెఅర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పేకాడుతున్న పది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.24.640 నగదు, పది సెల్ఫోన్లు, రెండు బైకులు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం బీకెపల్లె కాలనీ సమీపంలో ఓపెన్ ప్లేసులో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పేకాట స్థావరంపై దాడి చేసినట్లు సీఐ వివరించారు. ఈ మేరకు వారిని టూటౌన్ పోలీస్స్టేషన్కు తరలించి అరెస్టు చేసి రిమాండ్కు తరలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● డీఎంహెచ్వో నాగరాజు



వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

సిద్దవటం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పాటించి దోమల వ్యాప్తిని అరికట్టాలని కడప డీఎంహెచ్వో నాగరాజు తెలిపారు. మండలంలోని మాధవరం-1 పార్వతీపురం గ్రామంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాత్రివేళల్లో దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు. కుష్టువ్యాధి బాధితులను పరామర్శించి తగు జాగ్రత్తలు సూచించారు. కాళ్లు వంకర ఉన్న వారు ఫిజియోథెరపీ చేయించుకోవాలని తెలిపారు. మాధవరం ప్రైమరీ హెల్త్సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ నవంబరు 17 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో స్పర్శలేని పొడలు ఉన్నవారిని గుర్తించి జాగ్రత్తలు, సలహాలు సూచించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ రవిబాబు, మలేరియా సబ్యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, డీపీఎంవో రాఘవ, హెల్త్ సూపర్ వైజర్ రమణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



అభిషేక్కుమార్ (ఫైల్ఫొటో)

రామసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న విద్యార్థి అభిషేక్కుమార్(17) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. జక్కంవారిపల్లె వాసి అభిషేక్కుమార్ ఇంటర్ చదువుతున్నాడు. కాలేజీకి సరిగా వెళ్లలేదని విద్యార్థి తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్థాపానికిగురై ఈనెల 13న విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మదనపల్లెలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

పిడుగుపాటుతో మహిళకు తీవ్రగాయాలు



పిడుగుపాటుకు గురైన గౌరమ్మ

ఓబులవారిపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పున్నాటివారిపల్లె అరుంధతివాడకు చెందిన గొడుగునూరు గౌరమ్మ అనే మహిళ పిడుగుపాటుతో తీవ్రంగా గాయపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గొడుగునూరు గౌరమ్మ, లేబాకు రామలక్షుమ్మ శుక్రవారం గొర్రెలు మేపుకునేందుకు పచ్చిక బీళ్లలోకి వెళ్లారు. సాయంత్రం 4 గంటల సమయంలో వారికి సమీపంలోనే పిడుగు పడడంతో ఇద్దరూ కుప్పకూలిపోయారు. ఈ సంఘటనలో గౌరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కొద్దిసేపటికి తేరుకున్న రామలక్షుమ్మ పరుగెత్తుకొంటూ ఇంటికి వెళ్లి బంధువులకు, కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. దీంతో వారు గౌరమ్మను రైల్వేకోడూరు ఆసుపత్రికి తరలించారు. టీడీపీ నాయకుడు పున్నాటి వాసుదేవరెడ్డి పరామర్శించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

తంబళ్లపల్లె, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రామిగానిపల్లె వద్ద ఈ నెల 15వ తేదీన చైన్ స్నాచింగ్కు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఉమామహేశ్వర్రెడ్డి తెలిపారు. శుక్రవారం తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె క్రాస్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా నిందితులు నేరం అంగీకరించారన్నారు. నిందితులు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం విరువూరుకు చెందిన గడ్డం కాశిరెడ్డి(21), కడప జిల్లా సీకే దిన్నె మండలం గురుగుపుడు తండాకు చెందిన బి.సతీష్నాయక్(25)గా తెలిపారు. నిందితుల నుంచి 36 గ్రాముల బంగారు చైన్ స్వాధీనం చేసుకుని రిమాండ్కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జీవనోపాధి మెరుగుకై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నాగేశ్వరరావు

తంబళ్లపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లోని సభ్యుల జీవనోపాధి మెరుగుపరచడంపై దృష్టి సారించాలని సెర్ప్-డీఆర్డీఏ పీడీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు మహిళా సమాఖ్య కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఏపీఎంలు, డీపీఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు, సీసీలతో పీడీ సమీక్షించారు. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో తిరిగి చెల్లించేలా చూస్తూ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వ్యాపార అవకాశాలు, రాయితీ రుణాలు, ప్రభుత్వం అందించే ఇతరత్రా ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ మహిళలు సద్వినియోగం చేసుకునేలా చైతన్య పరచాలన్నారు. మహిళలను లక్షాధికారులు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ఏపీడీ లక్ష్మీ ప్రసాదరెడ్డి, ఏపీఎంలు గంగాధర్, శ్రీలక్ష్మీ, నాగార్జున, శ్రీనిధి మేనేజరు అమరావతి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, డీపీ ఎంలు, ఏరియా కోఆర్డినేటర్లు, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు భవన్సాయి

మదనపల్లె అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు వేద పాఠశాల విద్యార్థి జి.భవన్సాయి చంద్రకుమార్ ఎంపికైనట్లు కోచ్ రెడ్డి రాఘవేంద్ర తెలిపారు. చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అంతర జిల్లా క్రీడల్లో మొదటి స్థానంలో నిలిచారన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా అండర్ 14 క్రికెట్ క్రీడలు ఈ నెల 29 నుంచి గుంటూరులో జరగనున్నాయి. ఇందులో ఎంపికైన విద్యార్థిని పాల్గొంటాడని శ్రీవేద పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణరెడ్డి, చైర్మన్, రాజు రామమోహన్రెడ్డి, ప్రిన్సిపాల్ ఉపేంద్రరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మురళి, ఏవోలు కిషోర్, నాగరాజు, కోచ్ రెడ్డి రాఘవేంద్ర వ్యాయామ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



లోన్ యాప్... తస్మాత్ జాగ్రత్త

- అవసరమని తీసుకుంటే.. మీ అకౌంటును ఖాళీ చేస్తారు
- ఆన్‌లైన్ యాప్‌లతో వేధింపులు తప్పవు
- 11 నెలల్లో 271 ఫిర్యాదులు.. రూ.42లక్షలు పైనే స్వాహా



కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మన ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకుని వేధింపులకు, ఆర్థిక మోసాలకు పాల్పడే ఫేక్ లోన్ యాప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొ స్తున్నాయి. ఈ రుణ యాప్‌ల వలలో చిక్కుకొని కొందరు విలవిలలాడుతున్నారు. తమ అవసరాల కోసం రుణాలు పొందిన వారి నుంచి అంతకు పదిం తలు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒకవేళ డబ్బులు కట్టకపోతే మొబైల్‌లో ఉన్న డేటా దొంగలించి ఫొటోలు మార్ఫింగ్ చేసి కాంటాక్టులో ఉన్న అందరికీ షేర్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతుంటారు. ఒకప్పుడు పర్సనల్ లోను తీసుకోవాలంటే చాల పెద్ద ప్రాసెస్ ఉండేది. బ్యాంకుల్లో లోను కోసం దరఖాస్తు చేస్తే ఆ వ్యక్తి ఆదాయ వివరాలు అన్నీ పరిశీలించిన తరువాత రుణం మంజూరు చేయాలా లేదా అని నిర్ణయించేవారు. ఈ ప్రాసెస్ మొత్తం రెండు మూడు వారాల నుంచి నెలల సమయం పడుతుం డేది. ఇప్పుడు పర్సనల్ లోను తీసుకోవాలంటే మంచి క్రెడిట్ హిస్టరీ ఉంటే ఆన్‌లైన్‌లో పది నిమిషాల్లోనే రుణం పొందవచ్చు.

సోషల్ మీడియాలో వచ్చే లోన్ యాప్‌లను నొక్కి మనకు కావలసిన అమౌం టుతో పాటు మన వ్యక్తిగత వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. అయితే సదరు సంస్థలకు సకాలంలో రుణాలు చెల్లించకపోతే యాప్‌ల నిర్వాహకులు వేధింపులు మొదలు పెడ తారు. వీళ్ల వేధింపులు తాళలేక ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా గతంలో ఎన్నో ఉన్నాయి. ఇలాంటి సోషల్ మీడియాలో వచ్చే నకిలీ యాప్‌ల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేధింపులు తాళలేక...

జిల్లాలో యాప్‌ల ద్వారా లోన్లు పొందిన వారు 11 నెలల్లో దాదాపు 271 మంది ఉన్నా రంటే.. ఎలా మోసపోతున్నారో ఇట్టే అర్థమవుతుంది. ఇక లోను యాప్‌ల ద్వారా లోన్ తీసుకున్న వారు తీసుకున్న డబ్బుల కంటే దాదాపు 42 లక్షల వరకు అధిక వసూళ్లకు పాల్పడ్డారు. దీంతో లోను యాప్ నిర్వాహకుల వేధింపులు తాళలేక చివరికి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఇలాంటి లోను యాప్‌లపై తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నకిలీ యాప్‌లే ఎక్కువ

తమ అవసరాల నిమిత్తం డబ్బు కోసం సోషల్ మీడియాను కొంతమంది వేదికగా చేసుకుంటున్నారు. అందులో వచ్చే ప్రకటనలకు ఆకర్షితులై లింకులు క్లిక్ చేసి తమ వ్యక్తిగత సమాచారం ఇవ్వడంతో వారి మొబైల్‌లో ఉన్న డేటాను సైబర్ నేరగాళ్లు కొట్టేస్తారు. మొత్తం మన మొబైల్‌లో ఉన్న అన్ని కాంటాక్టు నెంబర్లు, ఫొటోలు, డేటాను యాక్సస్ చేసుకుంటారు. ఇది లోన్ తీసుకున్నవారి పాలిట శాపంగా మారుతుంది. ఇలాంటి వాటిపై జాగ్రత్తగా ఉండాలంటూ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మోసపోయిన బాధితుల్లో కొందరు...

- కడపకు చెందిన ఓ యువతి తన అవసరాల కోసం రుణయాప్ ద్వారా రూ.50వేలు తీసుకుంది. తీసుకున్న డబ్బు కంతుల వారీగా చెల్లించింది. అయినా సైబర్ నేరగాళ్లు ఆ యువతినే డబ్బులు కట్టాలంటూ వేధింపులకు గురి చేశారు. తాను తీసుకున్న డబ్బులు కంటే అధికంగా డబ్బులు చెల్లించానని చెప్పినా టార్చర్ పెట్టారు. వాళ్ల టార్చర్ భరించిలేక ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది.
- కడపకు చెందిన ఓ వ్యక్తి వ్యాపార అవసరాల నిమిత్తం రూ.32లక్షలు ఈ నకిలీ యాప్ ద్వారా లోను పొందారు. అయితే అతను తిరిగి డబ్బులు చెల్లిస్తున్నా మిగతా డబ్బులు కూడా కట్టాలని, లేకుంటే నీ ఫొటోలు కాంటాక్టులందరికీ పంపిస్తానని బెదిరింపులకు పాల్పడడంతో ఆ వ్యక్తి పోలీసులను ఆశ్రయించారు.
- ప్రొద్దుటూరుకు చెందిన ఓ మహిళ లోను యాప్ ద్వారా రుణం తీసుకుంది. డబ్బులు చెల్లించినప్పటికీ మళ్లీ డబ్బులు కట్టా లని రకరకాల నెంబర్ల నుంచి అతన్ని టార్చర్ పెట్టడం మొదలు పెట్టారు. ఇలాంటి సైబర్‌నేరాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. అలాగే ప్రజలు కూడా అత్యాశ పడి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా లోను పెడితే మాత్రం మీ చేతులారా మీరే నష్టపోవాల్సి వస్తుంది.

ప్రొద్దుటూరు ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై విచారణకు ఆదేశం

- డాక్టర్ లక్ష్మీప్రసాద్‌కు నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం

కలికిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ లక్ష్మీప్రసాద్ వ్యవహారాలపై విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఆయనపై వచ్చిన అభియోగాలపై 10 రోజుల్లోగా సంజాయిషీ పంపుకోవాలని ఈ నోటీసులో ప్రభుత్వం పేర్కొంది. ప్రధానంగా ఆసుపత్రి నిర్వహణలో లక్ష్మీప్రసాద్ పూర్తిగా విఫలమైనట్లు ప్రభుత్వం నిర్ధారకొచ్చింది. రోగులను చేర్చుకోవడంలో, డిస్చార్జి చేయడంలో పారదర్శక విధానాలను, ప్రాధాన్యతలను విస్మరించారని ఆరోపించారు. ఆక్సిజన్ డిమాండు, సరఫరా ల్లో సమతుల్యత లేకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడం కూడా ప్రభుత్వ ఆగ్రహానికి కారణమయ్యింది. ఆక్సిజన్ మేనేజ్‌మెంట్ కమిటీ, మేనేజ్‌మెంట్ టీములను ఏర్పాటు చేయడంలో విఫలమయ్యాడని కూడా అభియోగం నమోదయ్యింది. ఆసుపత్రి నోడల్ అధికారికి సహకరించడం లేదన్నది మరో ఆరోపణ. ఆక్సిజన్ సరఫరా నిర్వహణ, రోగుల సంఖ్యకు తగ్గట్లు పడకల పెంచకపోవడాన్ని కూడా ప్రభుత్వం తప్పుబట్టింది. ఆసుపత్రి వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించడంలో పారదర్శకత పాటించలేదని, రోగుల అడ్మిషన్లు, డిస్చార్జీలు, మరణాలకు సంబంధించి ఉన్నతాధికారులను తప్పుదారి పట్టించే విధంగా నిర్లక్ష్యంగా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా ఆక్సిజన్ సరఫరాను పర్యవేక్షించడంలో అవసర మైన చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. వీటన్నిటితోపాటు గతంలో 2021 మే 11 నుంచి 2022 మార్చి 21 వరకూ ఎలాంటి సమాచారం లేకుండా గైరుహాజరు కావడంపై కూడా వివరణ సమర్పించాలని ఆదేశిం చారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్ నుంచి సంజాయిషీ అందిన అనంతరం విచారణ కు ఆదేశాలు జారీ చేయనున్నారు. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గతంలో పనిచేసిన సీనియర్ అసిస్టెంట్‌పై చిత్తూరుకు చెందిన జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. శుక్రవారం చిత్తూరు డీసీహెచ్ఎస్ పద్మాంజలిదేవితోపాటు మరో ఇద్దరితో కూడిన బృందం జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. ఇక్కడి మెడికల్ సూపరింటెండెంట్ సుజాతతో కలిసి విచారణ చేపట్టారు. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నాగార్జున అనే వ్యక్తి సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఇక్కడి నుంచి అనంతపురం జిల్లా ధర్మవరంకు బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత అతనిపై పోలీసు కేసు నమోదు అయింది. ఈ క్రమంలో దర్యాప్తుల్లో భాగంగా అతను పనిచేసిన ప్రాంతాలు, వ్యవహార శైలిపై విచారణ చేశారు. అతని సర్వీసు రికార్డులను పరిశీలించారు. స్థానిక అధికారులను విచారణకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. ఆర్ఎంవో డాక్టర్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో గోవా మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. స్థానిక కడప రోడ్డుకు సమీపంలోని గరుగువీధిలో మద్యం బాటిళ్లు ఉన్నాయన్న సమాచారం మేరకు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

పులివెందుల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రగిరిలో గుడివెల నాగేష్ (39) అప్పుల బాధ తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. గుడివెల నాగేష్ గత ఐదేళ్ల క్రితం చంద్రగిరిలో రమణమ్మ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. నాగేష్ స్వగ్రామం అనంతపురం జిల్లా గాండ్లపెంట మండలం నరసప్పగారిపల్లె. చంద్రగిరిలో పెళ్లి చేసుకోవడంతో ఇక్కడే కూలి పనులకు వెళ్తూ జీవిస్తున్నాడు. ఇతనికి నాలుగేళ్ల కుమార్తె, భార్య ఉన్నారు. గత నాలుగైదు రోజులుగా నాగేష్ మూడీగా ఉండడంతో భార్య ఆరా తీసింది. అప్పులు ఎక్కువయ్యాయని, అప్పులవారి నుంచి ఒత్తిడి పెరిగిందని భార్యకు తెలిపాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో నాగేష్ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

ఓబన్నపేటలో వృద్ధుడు...


ఓబుళరెడ్డి మృతదేహం

కొండాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఓబన్నపేట గ్రామంలో కల్లూరు ఓబు ళరెడ్డి (71) అనే వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. మరుగుజ్జు ఆయిన ఓబుళరెడ్డి గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. కడుపు నొప్పి తాళలేక శుక్రవారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెంది నట్లు పోలీసులు తెలిపారు. ఓబుళరెడ్డి మరుగుజ్జు కావ డంతో వివాహం చేసుకోలేదు. ఒంటరిగానే ఉంటున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- ముగ్గురికి గాయాలు



గోపవరం/బద్వేలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని నేషనల్ హైవే-67 నూతన బైపాస్ రోడ్డులో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక వృద్ధురాలు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. శుక్రవారం బెంగుళూరు నుంచి నెల్లూరు జిల్లా కందుకూరు వెళుతున్న కారు గూడెం-గుంతపల్లె మార్గమధ్యంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడటంతో బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే సంఘటన గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ధర్మాపురం వద్ద రోడ్డు ప్రమాదం

- ఆరుగురికి గాయాలు


గాయపడినవారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

జమ్మలమడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రొద్దుటూరు రోడ్డులో ధర్మాపురం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి 7.20 గంటలకు రోడ్డు ప్రమాదం జరిగింది. వర్షం కురుస్తున్న సమయంలో ప్రొద్దుటూరు వైపు నుంచి ప్రసాద్‌రెడ్డి, నాగేష్ అనే ఇద్దరు ద్విచక్ర వాహనంలో జమ్మలమడుగుకు వస్తుండగా కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. అదే సమయంలో వెనుకవైపు వైపు నుంచి లారీ, బస్సు ఢీకొన్నాయి. ఈఘటనలో ఆర్టీసీ అద్దె బస్సు స్వల్పంగా ముందుభాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న వీరయ్య, జయరాముడు, సింగరయ్యతోపాటు మరికొందరు గాయపడ్డారు. వారిని 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్కా ఆడుతున్న ఇద్దరు అరెస్టు

కడప క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలో మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య ఆదేశాల మేరకు నగరంలో దాడులు నిర్వహించి.. మట్కా ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.6500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్

- ఏపీఎస్పీడీసీఎల్ ఫోరం చైర్మన్


మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి

పులివెందుల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం చేపట్టినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ డివిజన్ ఆఫీస్ కాంపౌండ్ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిత్యం రైతులు, ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చొరవ చూపాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి వినియోగదారులు హాజరై తమ సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో ఫోరం మెంబర్లు మధుకుమార్ (ఫైనాన్స్), ఇండిపెండెంట్ మెంబర్ విజయలక్ష్మి, పులివెందుల డివిజనల్ ఇంజనీర్ ప్రసాదరెడ్డి, ఏడీఈ గురుమోహన్‌రెడ్డి, ఏఈలు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ రాని విద్యార్థులకు షూరిటీ బాండ్ ద్వారా ఇవ్వాలి

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి

వేంపల్లె, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ట్రిపుల్‌ఐటీల్లో కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫీజు చెల్లించని కారణంగా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. గత ప్రభుత్వం ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులకు సమస్యలు ఎదుర వుతున్నాయి. ఇలాంటి విద్యార్థులకు షూరిటీ బాండ్ తీసుకొని సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కలెక్టర్‌కు, ఆర్జీయూకేటీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని కారణంగా సర్టిఫి కెట్లు ఇవ్వడం లేదంటూ పలువురు విద్యార్థులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం కడప కలెక్టరేట్‌లో ప్రభుత్వ అంచనాల కమిటీ సమావేశంలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల సమస్యను ప్రస్తావించారు. ఆర్జీయూకేటీ వీసీ విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ సంద్ర, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తలకు విద్యార్థుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు. ప్రభుత్వం ఇవ్వని బకాయిలకు షూరిటీ బాండ్లు తీసుకొని సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరగా ఆర్జీయూకేటీ అధికారులు అంగీకరించినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

సోలార్ ప్రాజెక్టులో ఉద్యోగావకాశాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలో మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (సోలార్ ప్రాజెక్టు)లో ఉద్యోగావకాశాలు ఉన్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిప్లమా, బీటెక్, డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేసినవారికి సోలార్‌లో అనుభవం ఉన్న యువతకు ఈ ఉద్యోగాలు కల్పించను న్నట్లు ఆమె వివరించారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు ఎల్ఐసీ సర్కిల్ సమీపంలో ఉన్న విశ్వేశ్వరయ్య భవన్‌లో ఇంటర్వ్యూలు జరగనున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 6302702399, 7032325252 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

పరిశోధన మెలకువలు అత్యంత ఆవశ్యకం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): స్కాలర్‌లకు పరిశోధన మెలకు వ లు అత్యంత ఆవశ్యకమని భారత ప్రభు త్వ సైన్స్, టెక్నాలజీ సెంటర్ ఫర్‌పాలసీ రీసెర్చ్‌కు సమన్వయకర్త, హైదరాబాద్ సెం ట్రల్ యూనివర్సిటీ సోషియాలజీ ప్రొఫెసర్ సి.రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం వైఈయూ అన్న మాచార్య సెనేట్ హాల్లో స్కాలర్‌లకు పరిశోధనకు తాత్విక పునాది, పరిశోధన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆచార్యులు, సహ ఆచార్యులు, అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజారెడ్డి కాలనీలో చోరీ

- బంగారం, డబ్బులు ఎత్తుకెళ్లిన దుండగులు

పులివెందుల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారెడ్డి కాలనీలో నివాసముంటున్న మునిప్రసాద్ ఇంటిలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... లింగాల మండలం లోపట్నూతలకు చెందిన మునిప్రసాద్ తమ పిల్లల చదువుల కోసం రాజారెడ్డికాలనీలో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం 8గంటలకు తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడు స్కూల్‌కు వెళ్లగానే మునిప్రసాద్ తన భార్య లోపట్నూతలలోని పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో మునిప్రసాద్ కుమార్తె స్కూల్ నుంచి ఇంటికి వచ్చింది. ఆ సమయంలో ఇంటికి ఉన్న బీగాన్ని పగులగొట్టి, బీరువాలో ఉన్న బట్టలు చిందరవందరగా ఉండడం చూసింది. వెంటనే తండ్రికి తెలియజేయడంతో ఆయన వచ్చి పరిశీలించగా.. 40గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1.40లక్షలు విలువైన వెండిని చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ విష్ణునారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ పాప సంబంధీకులు ఉంటే... సంప్రదించండి

- జిల్లా బాలల పరిరక్షణ అధికారి



కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 15 నెలలు వయసు గల ఆడపాపను గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 17వతేదీ ఆర్టీసీ బస్టాండులో వదిలిపెట్టి వెళ్లినట్లు జిల్లా బాలల పరిరక్షణ అధికారి డీఆర్ సుభాష్‌యాదవ్ తెలిపారు. ఈ విషయం తెలిసి కారుణ్య ఫౌండేషన్ వారు ఆ పాపను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. విషయం తెలుసు కున్న జిల్లా బాలల పరిరక్షణ విభా గం ఐసీడీఎస్ అధికా రులు కారుణ్య ఫౌండేషన్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ పాప ప్రత్యేక దత్తత సంస్థలో ఆశ్ర యం పొందుతోంది. ఎవరైనా ఆ పాప తల్లిదండ్రులు కానీ రక్తసంబంధీకులు కానీ తగిన ఆధారాలతో సంప్రదించాలని ఆయన తెలిపారు.

శ్రీశైలం బస్సు రాకకోసం..

- బస్టాండ్‌లో ప్రయాణీకుల పడిగాపులు
- రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరిన బస్సు

కడప మారుతీనగర్, నవంబర్ 21 (మారుతీనగర్): కడప డిపో నుంచి శ్రీశైలం బయలుదేరాల్సిన ఆర్టీసీ బస్సు ఆలస్యంగా బస్టాండ్‌కు చేరుకోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 1-30 గంటలకు బయలుదేరాల్సిన బస్సు 3-30 గంటలకు (దాదాపు 2 గంటలు ఆలస్యంగా) బస్టాండుకు చేరుకోవడంతో ప్రయాణీకులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. కడప డిపో నుంచి శ్రీశైలానికి ప్రతిరోజూ రెండు బస్సులు తిప్పుతున్నారు. అందులో ఒక బస్సు తెల్లవారు జామున 5 గంటలకు, మరో బస్సు మధ్యాహ్నం 1-30కి శ్రీశైలానికి కడప డిపో నుంచి బయలు దేరుతాయి. అయితే శుక్రవారం కడప డిపో నుంచి మధ్యాహ్నం 1-30కు బయలు దేరాల్సిన ఏపీ04జెడ్-0305 నెంబర్ గల ఎక్స్‌ప్రెస్ బస్సు డిపో నుంచి బస్టాండుకు రాలేదు. బస్సు ఎంత సేపటికీ బస్టాండ్‌కు చేరుకోకపోవడంతో ప్రయాణీకులు ఎంక్వయిరీ (విచారణకేంద్రం) దగ్గరకెళ్లి ఆరా తీశారు. అయితే వారికి సరైన సమాధానం రాలేదు. దీంతో బస్సు కోసం వేచి ఉన్న దాదాపు 40 మంది ప్రయాణీకులలో సగం మంది ఇంటికెళ్లిపోయారు. చివరకు మధ్యాహ్నం 3-30కి గ్యారేజీ నుంచి బస్సు బస్టాండ్‌కు చేరుకుంది. దీంతో మిగిలిన 24 మందితో ఆ బస్సు శ్రీశైలానికి బయలుదేరింది. ఈ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసి అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. కాగా బస్సు స్ప్రింగ్ ప్లేట్స్ కట్ కావడంతో గ్యారేజీలో మరమ్మతులు చేసినట్లు తెలుస్తోంది. ఈ కారణంగా బస్సు ఆలస్యంగా బస్టాండ్‌కు వచ్చినట్లు సమాచారం.


శ్రీశైలం బస్సు రాక కోసం కడప డిపోలో వేచివున్న ప్రయాణీకులు

సుస్థిర అభివృద్ధి సాధించాలి

సీఆర్‌పీలు, సంఘమిత్రలు, సచివాలయ సిబ్బందికి ఆదేశాలు ● పరిశుభ్రత, పచ్చదనం శిక్షణలో రాయచోటి డీఎల్‌డీఓ






కలకడలో వర్మీ కంపోస్టు తయారీని పరిశీలిస్తున్న రాయచోటి డీఎల్‌డీఓ లక్ష్మీపతి - నిమ్మనపల్లెలో డంపింగ్ యార్డు వద్ద ఎరువును పరిశీలిస్తున్న అధికారులు - కురబలకోట సమావేశంలో మాట్లాడుతున్న మదనపల్లె డీఎల్‌డీఓ అమర్‌నాథ్‌రెడ్డి - పెద్దమండ్యంలో చెత్త సేకరణలో అధికారులు

కలకడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు పంచాయతీలు సుస్థిర అభివృద్ధి సాధించాలని రాయచోటి డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన పరిశుభ్రత, పచ్చదనం శిక్షణలో ఆయన మాట్లాడుతూ వర్షకాలంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం చెత్తనుంచి సంపద కేంద్రాన్ని సందర్శించి వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించారు. ఎంపీడీఓ భాను ప్రసాద్ ఆధ్వర్యంలో తడి- పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. సమస్యలపై గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడి పరిష్కారించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ శైలజ, ఏపీఓ సుజాత, పీడీఓలు దేవేంద్ర, జయచంద్ర, ఉదయ్, అయేషా తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం...

పీలేరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలని చెత్త సేకరణ సీఆర్‌పీలు, సంఘమిత్రలు, సచివాలయ సిబ్బందిని రాయచోటి డీఎల్‌డీఓ లక్ష్మీపతి ఆదేశించారు. గ్రామాల్లో చెత్త సేకరణపై అనుసరించాల్సిన పద్ధతులపై శుక్రవారం గూడురేవుపల్లె సచివాలయం శిక్షణలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి-పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గైడ్‌లకు అందించేలా గ్రామస్తుల్లో అవగాహన కల్పించాలన్నారు. అలా సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి ఎరువుగా మార్చాలన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటి ముందు కంపోస్టు పిట్ నిర్మించుకునేలా గ్రామస్తులను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. ఎంపీడీఓ శివశంకర్, డిప్యూటీ ఎంపీడీఓ యుగంధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

కురబలకోట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం, పచ్చదనం మెరుగునకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు మదనపల్లె డీఎల్‌డీఓ అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో పర్యావరణాన్ని పరిరక్షించడం, పచ్చదనం పెంపొందించడంపై శుక్రవారం ఎస్‌డబ్ల్యుపీసీ వద్ద గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్‌గార్డులు, ఎంఆర్‌సీలకు శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాభివృద్ధిని సాధిద్దామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, గ్రామాల్లో మొక్కలు నాటాలని, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి చెత్త సేకరణ పనులను పర్యవేక్షించి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, ఎంపీడీఓ గంగయ్య, ఈఓపీఆర్‌డీ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరించాలి

నిమ్మనపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలని ఎంఓ రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం రెడ్డివారిపల్లి పంచాయతీల కార్యదర్శులతో కలిసి క్లీన్‌అండ్ గ్రీన్ చేపట్టారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్స్‌కు సమావేశం నిర్వహించి రోజూ ఉదయం 7గంటలకు ప్రతి గ్రామంలో పర్యటించి చెత్తను సేకరించి చెత్త కేంద్రాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, కార్యదర్శులు నాగరాజ, గాయత్రి, మహమ్మద్, గౌతమి, రజిత, రాజనాయక్, నాగభూషనం, జనీపారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులుగా మలుచుకోండి

పెద్దతిప్పసముద్రం నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చెత్త సంపద కేంద్రాలను పంచాయతీ ఆదాయ వనరులుగా మలుచుకోవాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. శుక్రవారం పీటీఎం చెత్త సంపద కేంద్రం (డంపింగ్‌యార్డు)లో సర్పంచ్ తమకశంకర అధ్యక్షతన మండలంలోని గ్రీన్ అంబాసిడర్ల అవగాహన సదస్సులో ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు కార్యదర్శులు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు దుకాణదారులు సహకరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో చెత్త నుంచి సంపదను సృష్టించి పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి హాని

పెద్దమండ్యం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి హానికరమని ఎంపీడీఓ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చెత్తసేకరణ కార్మికులు చెత్త సేకరించారు. పేరుకు పోయిన చెత్తచెదారం తొలగించి వాహనాల్లో తరలించారు. ప్రతి ఒక్కరూ పరిసర ప్రాంతంలో పేరుకున్న చెత్త చెదారం, పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. పొడి, తడి చెత్త వేరు చేయాలన్నారు. ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ విమలకుమారి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు చెత్తసేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేకి సహకరించాలి




దిగువపల్లి సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీధర్‌రావు - తహసీల్దార్ శ్రీరాములుతో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ శ్రీకంఠరెడ్డి

పెద్దమండ్యం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇళ్లకు నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేకి సహకరించాలని పెద్దమండ్యం ఎంపీడీఓ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. దిగువపల్లిలో సర్పంచ్ బండి వాసవి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఇళ్లకు నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేతో ఇంటి యజమానులకు హక్కుల పత్రాలను ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విలేజ్ మ్యాప్ ఆధారంగా గ్రామాల్లో ప్రతి ఇంటినీ సర్వే చేస్తారని, ఇంటి నెంబరు కూడా తెలుస్తుందన్నారు. మరో పక్క గ్రామాల అభివృద్ధికి కూడా దోహదపడుతుందన్నారు. ఆయా సర్పంచులు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, గ్రామ పెద్దలు కలిసి సర్వే అధికారులు, సిబ్బందికి సహకరించాలన్నారు. సర్పంచ్ బండి వాసవి, డిప్యూటీ ఎంపీడీఓ విమలకుమారి, వీఆర్వోలు రెడ్డిశేఖర, గ్రామ పంచాయతీ కార్యదర్శి భూపతి, సురేష్‌రెడ్డి, నేతలు బండి యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమణలు తొలగించండి

పెద్దతిప్పసముద్రం నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వామిత్వ సర్వేలో గ్రామకంఠం భూముల కబ్జా విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 14న మల్లెల గ్రామంలోని రెవెన్యూ గ్రామమైన అమ్మళ్లబండకోటలో స్వామిత్వ సభలను నిర్వహించారు. గ్రామకంఠం భూమిని ఆక్రమించుకున్నట్లు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకురావడంతో తహసీల్దార్ గ్రామసభకు వెళ్లి అక్రమిత గ్రామకంఠం భూమిని సర్వేచేయాలని సర్వేయర్లను ఆదేశించడంతో సర్వేయర్లు నామమాత్రంగా సర్వే చేపట్టి హద్దులు చూపి చేతులు దులిపేసుకున్నారు. అక్రమణదారులు ఇంతవరకు అక్రమణలను తొలగించలేదన్నారు. వారమైనా భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరాణి గ్రామస్తులతో కలిసి శుక్రవారం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామకంఠం భూమి సర్వే సమయంలో భూమి యాజమాని లేకపోవడంతో అక్రమణలను తొలగించలేక పోయామని కార్యదర్శి వివరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ముందుగా పంచాయతీ అధికారులు గ్రామకంఠం భూమిని ఆక్రమించుకున్న వారికి సమయం కేటాయించాలని, అప్పటికీ అక్రమణలను తొలగించక పోతే రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమన్వయంతో పోలీసుల సహాయంతో అక్రమణలను తొలగించి అక్రమణదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించండి

● రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలు
● దారి కన్పించని ప్రమాదకర మలుపు



ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలతో పాతచెరువు కట్ట రోడ్డు

పెద్దమండ్యం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం - గాలివీడు రహదారి పాతచెరువు, బ్రాహ్మణ చెరువు, కుప్పాలకుంట కట్టపై నున్న తారురోడ్డు ఇరువైపులా మొలిచిన పిచ్చి మొక్కలు తొలగించాలని ప్రజలు కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పక్కన మొక్కలు ఏపుగా పెరిగి పోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న మంచుతో మూసుకుపోతోంది. రోడ్డు కనబడకుండా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకూ కనడడం లేదు. దీంతో ఆ వాహనాలు ఢీకొంటూ ప్రమాదాలకు గురవుతున్నాయి. చెరువుల కట్టలపై రోడ్డు ఉండడం చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడడం కష్టతరమైంది. దీంతో వాహనదారులు రాత్రీ పగలు తేడా లేకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డులో ఆటో కారు ఢీ కొనగా, ఓ లారీ బ్రాహ్మణ చెరువులో బోల్తా పడింది. గుర్రంకొండ రోడ్డులో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని రోడ్లకు పక్కనున్న పిచ్చిమొక్కలు తొలగించాలని ప్రజలు కోరారు. అధికారులు స్పందించాల్సి ఉంది.

సొసైటీ ద్వారా బెస్తలను అభివృద్ధి చేయాలి

మత్స్యశాఖ ఏడీ సుస్మితకు జిల్లా బెస్త సంఘం వినతి

మదనపల్లె అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులను సొసైటీ ద్వారా అభివృద్ధి పర్చాలని జిల్లా బెస్తసంఘం అధ్యక్షుడు మడితం రమణ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రం రాయచోటిలో ప్రపంచ మత్స్యకారులు దినోత్సవ సభలో జిల్లా అధ్యక్షుడు మడితం రమణను మత్స్యకారులు ఏడీ, మదనపల్లె ఎఫ్‌డీఓ నరేంద్ర సన్మానించారు. బెస్తలను అభివృద్ధి చేయాలని ఏడీకి వినతి పత్రం అందజేశారు. రమణ మాట్లాడుతూ సొసైటీలో మత్స్యకారులు, బెస్తలను మాత్రమే చేర్చుకోవాలన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల, కాల్వలు, ప్రాజెక్టు నిండుగా ఉన్నాయని, మత్స్యకారులు అవసరమైన పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ మానా చంద్రశేఖర్, సాయి, మోహన్‌కృష్ణ, రబీనా, శ్రీనవాసులు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్సతో కుష్ఠు నయం



గురుకుల హాస్టల్‌లో వంటగదిని తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

తంబళ్లపల్లె నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చికిత్సతో కుష్ఠును పూర్తిగా నయం చేయవచ్చని కోసువారిపల్లె ప్రభుత్వాస్పత్రి మెడికల్ ఆఫీసర్ సాదియా అన్నారు. శుక్రవారం 104వైద్య సిబ్బందితో కలిసి కన్నెమడుగు సచివాలయం పరిధి మర్రిమా కులపల్లెలో లెప్రసీపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈనెల 30 వరకు వైద్యఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో లెప్రసీ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి నమోదు చేయడం, వారికి వైద్యం ఎండీటీ (మల్టీ డ్రగ్ థెరపి) చికిత్స విధానాన్ని వివరిస్తారన్నారు. వైద్య శిబిరంలో జ్వరం, జలుబు, దగ్గు, బీపీ, షుగర్‌కు మందులను పంపిణీ చేశారు. ఆదర్శ పాఠశాల, ఎస్టీ గురుకులం, హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హాస్టల్ పరిసరాలు, శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం చలితీవ్రత పెరిగిన దృష్ట్యా కాచిచల్లార్చిన నీటిని అందించాలన్నారు. జ్వరం, దగ్గు, జలుబు వ్యాధులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏ కృష్ణా నాయక్, ఎంఎల్ హెచ్‌పీలు సిమ్రాన్, కీర్తి, ఆశా కార్యకర్తలు రెడ్డెమ్మ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

పరిమళను విధుల నుంచి తొలగించాలి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నేతలు

పీలేరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పీలేరు బాలికల గురుకులం గణిత ఉపాధ్యాయురాలు పరిమళను వెంటనే విధుల నుంచి తొలగించాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. తుమ్మల ధరణీ కుమార్ (మాలమహానాడు), బద్దె భానుప్రకాశ్(దళిత బహుజన విద్యార్థి సంఘం), దుబ్బా శ్రీకాంత్(కాంగ్రెస్) శుక్రవారం సాయంత్రం గురుకులాన్ని సందర్శించారు. అక్కడున్న విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో లక్కిరెడ్డిపల్లె అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్‌గా పరిమళ పనిచేస్తున్న సమయంలో ఆమె భర్త అదే గురుకులంలోని 5వ తరగతి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారని గుర్తు చేశారు. ఆ సమయంలో అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి పరిమళను సస్పెండ్ చేశారన్నారు. అనంతరం ఆమె గణిత ఉపాధ్యాయురాలిగా పీలేరుకు వచ్చిందన్నారు. పీలేరులో మరో ఘటన బయటకు వచ్చిందన్నారు. ఆమెను సస్పెండ్ చేసి గురుకుల విద్యార్థినులకు సురక్షిత వాతావరణం కల్పించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు

వాల్మీకిపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఎంఈఓ వెంకటరత్నంకు వినతిపత్రం అందజేశారు. సమగ్ర శిక్షలోని అన్ని కేటగిరీలకు హెచ్‌ఆర్ పాలసీని తక్షణం అమలు చేయాలని, మినిమం పే స్కేల్, రిటైర్‌మెంట్ వయసు పెంపు, ఖాళీ పోస్టుల భర్తీ, తదితర డిమాండ్ల పరిష్కారం కోసం 24వ తేదీ జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, డిసెంబరు 10న చలో ఎస్‌పీడీ ఆఫీస్ రాష్ట్రస్థాయి నిరసనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

లే-ఔట్లలో ఖాళీ స్థలాలను గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు శివకుమార్

పీలేరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కాలనీ లే-ఔట్లలో ఖాళీ స్థలాలను గుర్తించాలని తహసీల్దారు శివకుమార్ రెవెన్యూ, హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. లే-ఔట్‌లపై శుక్రవారం ఆయన తన కార్యాలయంలో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో మండల వ్యాప్తంగా 41 లే-ఔట్లలో 12 వేల ఇళ్ల పట్టాలు మంజూరు చేశారన్నారు. పలు కారణాలతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా వదిలేశారన్నారు. మరికొన్ని చోట్ల ఆక్రమణల ఫిర్యాదులు వచ్చాయన్నారు. తమ పరిధిలోని లే-ఔట్‌లను సందర్శించి పారదర్శకంగా విచారణ చేపట్టి ఖాళీ స్థలాలను గుర్తించాలన్నారు. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రమణయ్య, డీటీ ప్రసాద్, ఆర్‌ఐ మురగయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

రేపు కార్తీక వనభోజనాలకు రండి



వనభోజనాలకు అహ్వానిస్తున్న బలిజ సేవా సమితి సభ్యులు

మదనపల్లె టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సీటీఎం వద్ద బలిజ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్తీక వనభోజనాలకు హాజరు కావాలని మదనపల్లె బలిజ సేవా సమితి సభ్యులను సీటీఎం వాసులు అహ్వానించారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద వున్న బలిజ సేవా సమితి కార్యాలయంలో అధ్యక్షుడు బీపీఎల్ విజయ్‌కుమార్, ఈసీ సభ్యులు రాజ్ భవన్‌రాజా, టి.శ్రీనివాసులు, పి.సూరి, మదన్మోహన్, సొక్కం వేణుగోపాల్‌కు అహ్వాన పత్రికలు అందజేశారు. ఆదివారం సీటీఎం గ్రామం రేగడలోని మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించే కార్తీక వనభోజనాలకు బలిజలు అందరూ తప్పక హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీటీఎం బలిజ సేవా సమితి సభ్యులు పొగాకు వీరప్రతాప్, ఏ. మురళీమోహన్, ఓసూరి కిరణ్, ఉప్పు మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ అక్రమాలపై డీఎస్పీకి ఫిర్యాదు



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న భాగ్యనగర్ బాధితులు

మదనపల్లె అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పోతబోలు గ్రామం రెవెన్యూ సర్వేనెంబరు 153లో తాము కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలను వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నేతలు సీనియర్ సిటిజన్స్ నుంచి దౌర్జన్యంగా ఆక్రమణ చేశారు. ఈమేరకు శుక్రవారం బాధితులు నారాయణస్వామి, వరప్రసాదు, మల్లికార్జున, రెడ్డెప్ప, వెంకటరమణ డీఎస్పీ మహేంద్రను కలిసి ఫిర్యాదు చేశారు. 20 ఏళ్ల కిందట భాగ్యనగర్ పేరుతో వేసిన వెంచర్లలో నెలకువెయ్యి రూపాయల చొప్పన కంతుల ప్రకారం డబ్బు కట్టి స్థలాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నామన్నారు. తమ వద్ద ఉన్న అన్ని రికార్డులను డీఎస్పీకి చూపిస్తూ ఈ స్థలాల మీదుగా జాతీయ రహదారి వెళ్లడంతో ప్రభుత్వ రికార్డుల ప్రకారం పరిహారం అందించినట్లు వివరించారు. సీనియర్ సిటిజన్స్ అందించిన రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

గుర్రంకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్‌ఐ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ ఆటో, జీపు, లారీ, ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడిపి ప్రమాదాలు జరిగితే ప్రాణ నష్టం జరిగే ప్రమాదముందన్నారు. వాహనదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని తెలిపారు. వాహనాలను రోడ్డుపై ఇష్టానుసారంగా నిలిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పార్కింగ్ విషయమై వాగ్వాదం

గుర్రంకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బస్‌స్టాండులో ఆటోల పార్కింగ్ విషయమై శుక్రవారం వ్యాపారులకు ఆటో డ్రైవర్ల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. బస్టాండులో ఆటోలను రోడ్డుకు ఇరువైపులా అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వ్యాపారులు తమ దుకాణల ముందర ఆటోలను అడ్డుపెడితే ఎలాఅంటూ వాగ్వాదం చేసుకున్నారు. దీంతో బస్‌స్టాండులో కొంత సమయం ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు వచ్చి ఆటోలను ఎక్కడపడితే అక్కడ ఉంచరాదని సూచించడంతో సమస్య సద్దుమనిగింది.

వ్యవసాయేతర పనులకు ఎరువులు విక్రయించరాదు

పీలేరు ఏడీఏ రమణరావు



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ రమణరావు, ఏఓ నవీన్‌కుమార్

మదనపల్లెటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీ ధరలకు పంపిణీ చేస్తున్న ఎరువులను వ్యవసాయేతర పనులకు విక్రయించరాదని పీలేరు ఏడీఏ రమణరావు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో 12 ఎరువుల దుకాణాలు, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో డ్రిప్ ఎరువుల తయారీ పరిశ్రమను ఏఓ నవీన్‌కుమార్‌తో కలిసి ఏడీఏ తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ యూరియా, అమ్మోనియం నైట్రేట్ ఎరువులను కేవలం వ్యవ సాయానికే ఉపయోగించేలా రైతులకు సూచనలు ఇవ్వాలని ఎరువుల డీలర్లకు అవగాహన కల్పించారు. ప్రతి ఎరువుల బస్తా ధరల వివరాలు, గోదాములో ఎరువులు, పురుగు మందుల స్టాకు వివరాలు తప్పనిసరిగా బోర్డులో కనిపించేలా ప్రదర్శించాలన్నారు. కార్యక్రమాల్లో డీలర్లు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో వర్షం

రైల్వేకోడూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఒక మోస్తరు వర్షం కురిసింది. పాదచారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానదారి, రైల్వేస్టేషన్ రోడ్డు తది తర ప్రాంతాల్లో వర్షపు నీరు ప్రవహించింది. తిరుపతి-కోడూరు,

పెనగలూరు :మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. పది నిముషాలకోసారి విడతలు విడతలుగా వర్షం కురిసింది.

నిత్యపూజేశ్వరకోనలో వ్యర్థాల తొలగింపు

సిద్దవటం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిత్యపూజేశ్వరకోనలో పోగుపడిన వ్యర్థాలను శుక్రవారం కూలీలతో అధికారులు తొలగించారు. పంచలింగాల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించారు. ఆలయ చైర్మన్ జింగిటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో రావడంతో సన్నిధానం, పంచలింగాల వద్ద పోగు పడిన వ్యర్థాలను తొలగించామన్నారు. మహిళలకు టాయిలెట్, స్నానపు గదుల నిర్మాణం విషయాన్ని ఇన్‌చార్జి ఈఓ శ్రీధర్ దృష్టికి తీసుకెళితే త్వరలో పనులు చేపడతామన్నారు.